# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
గూడూరి వెంకట రత్నం
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ఎస్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు
డా॥ యమ్ స్వర్ణముఖి

సంపుటి 33 సంచిక 1
పేజీలు 40
సెప్టెంబర్ 2013
**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**
బ్యాంక్ డ్రాఫ్ట్ A/C Y.S.C.K.P.M
చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన
చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by
C.V. Ramana Babu
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Samardha Sadguru Publications,
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh and
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
DUGGIRALA JAGANMOHANA
BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**

| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| యోగి వేమన | 3 |
| శ్రీబాబూజీ ఉవాచ | 4 |
| శ్రీమాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 8 |
| శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు | 10 |
| యోగవాశిష్ఠము | 11 |
| గురు కృపాహి కేవలమ్ | 13 |
| లోకనాధంగారి ఏకాదశి | 15 |
| పరిప్రశ్నేన సేవయా | 16 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 17 |
| దీపముండగానే యిల్లు చక్కబెట్టుకో | 19 |
| సర్వము నీ దయ | 21 |
| సమర్థ సద్గురు పబ్లికేషన్స్ | 22 |
| చందాదారులకు విజ్ఞప్తి | 24 |
| ఏకాగ్ర దృష్టి | 25 |
| బాలకృష్ణుని లీలలు | 27 |
| కృష్ణా మా యింటికి రావో | 28 |
| సర్వజ్ఞుడు శ్రీబాబు | 31 |
| సమర్థ సద్గురు సభ్యత్వాన్ని పెంచండి | 33 |
| శ్రీసద్గురు పుణ్యారాధన రజతోత్సవ వేడుకలు | 34 |
| సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర | 35 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

అవిద్యాయాం బహుధా వర్తమానాః
వయం కృతార్థా ఇత్యభిమన్యన్తి బాలాః
యత్కర్మిణో న ప్రవేదయన్తి రాగాత్
తేనాతురా క్షీణ లోకాశ్చవన్తే (ముణ్డకోపనిషత్)

లౌకిక దృష్టితో లౌకిక కర్మలను చేయటంలో ప్రీతితో తత్త్వ దృష్టిని తెలుసుకో లేక పోతున్నారు. ఇది కేవలం అజ్ఞానమే. తాము వివేకవంతులమని, పండితులమని, సంచరిస్తారు. లౌకిక కర్మలు ఆచరించేవారు కేవలం ఆ కర్మఫలం గురించిన అవగాహన కలిగి ఉండవచ్చు. దానివలన తాము కృతార్థులమయ్యామని భావిస్తారు.



కాని వారికి తత్త్వదృష్టిగాని, తమ నిజతత్త్వాన్ని తెలుసుకుందామనిగాని యిచ్ఛ ఉండదు. యజ్ఞ యాగాదులు, అన్నదానంలాంటి పుణ్యకర్మలు ఆచరించటం తప్పుకాదు. వాటిద్వారా పుణ్యఫలాన్ని ఆర్జించి స్వర్గలోక ప్రాప్తి కలుగవచ్చు. లేదా ఉత్తమ జన్మ ప్రాప్తించవచ్చు.

విషయాలలో విహరించే చిత్తానికి ముక్తి సాధనకి అర్హత ఉండదు. వీరి చిత్తము యీర్ష్య అసూయలతో అహంకారముతో ప్రవర్తిస్తే స్వర్గలోక ప్రాప్తి కాని, ఉత్తమ జన్మకాని దుర్లభమే. వారివారి చిత్తానికి తగిన నీచ గర్భాలలో జన్మలెత్త వలసిందే. మోక్షం ఏదో కర్మచేసి, సంపాదించేది కాదు. అది కేవలం సద్గురుమూర్తిని ఆశ్రయించి బ్రహ్మవిద్యా శ్రవణం విచారణ ద్వారా సాధ్య పడుతుంది.

అంతేకాదు సద్గురుమూర్తిని ఆశ్రయించిన సాధకుడు తాను ఆచరించే ఏ కర్మఫలాన్నైనా త్యాగం చేయగలగాలి. అదే నిజమైన వైరాగ్యం. వైరాగ్యం సాధించినంత మాత్రాన మోక్షం ప్రాప్తించదు. అది మోక్షసాధనకు కేవలం అర్హత మాత్రమే అని గ్రహించాలి. సద్గురుమూర్తి ఆశ్రయమును పొందక తమకు తామే వివేకవంతులమని ప్రవర్తించేవారు గుడ్డివాని చేయి పట్టుకుని వెళ్ళేవాడి గతికి భిన్నంగా ఉంటుందా? ఏ ముళ్ళ కంపలోనో, మురికి గుంటలోనో పడక తప్పదు కదా!

*

# యోగి వేమన

గత సంచిక తరువాయి

- శ్రీ బులుసు వెంకటరమణయ్య

తగదు తగదటంచు తగువారు చెప్పిన
వినఁడు మొఱకు చెడును గొనకు నిజము,
మునులు చెప్పు ధర్మముల మీరనింతెకా
విశ్వదాభిరామ! వినుర వేమ!

తాత్పర్యము -

ఇది తగదని, తగినవారెంత చెప్పినా మూర్ఖుడు వినడు. వాడు మునులు చెప్పిన ధర్మములను అతిక్రమించి నడుచుచు చెడిపోవును.



తనదు బాగుఁగోరి ధర్మంబు చెప్పినఁ
దిట్టుచుంద్రు మొఱకు లెట్టయెదుట
గడ్డివేయ పోట్లగొడ్డు కొమ్మాడించు
విశ్వదాభిరామ! వినుర వేమ!

తాత్పర్యము -

తన బాగు కోరి మంచి చెప్పినవారిని మూర్ఖులు ముఖము ముందే తిట్టుదురు. దయ తలచి తినుటకు గడ్డివేయగా పోట్లగొడ్డు పొడుచుటకు కొమ్ములాడించును.

తనలో సర్వంబుండఁగ
తనలోపల వెదుకలేక ధరవెదకెడి యీ
తనువుల మోసెడి యెద్దుల
మనములఁదెల్పంగ వశమె మహిలో వేమా!

తాత్పార్యము -

తమ లోపలనే భగవంతుడుండగా తెలిసికొనలేక అతని కొరకు పైచోట్ల వెదకువారు మూర్ఖులు. బుద్ధిహీనులు. వారికి నచ్చజెప్పుట ఎవ్వరికిని సాధ్యముకాదు.



# శ్రీబాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధచేస్తూ 'ఎంత తేలికో అంతకష్టం, ఎంతకష్టమో అంత తేలిక' అది ఏమిటో చెప్పండి చూద్దాం. మీరంతా చదువుకున్న వారు. మీ ముందు నేనెంత? కోన్‌కాస్ గొట్టం అని అన్నారు. కాని మా అమ్మ నాజిహ్వాపై నాట్యం చేసి పలికిస్తుంది. ఆ పలికిన దానిలో వేదాంత రహస్యం ఇమిడి ఉంటుంది. అసలు నీవు ఎవరవు అని ప్రశ్న వేసుకొంటే ఆ ప్రశ్నకు సమాధానం ఎంతమందికి దొరుకుతుంది? ఈ ఉపాధి ఒక గొట్టం. ఇది నేను, నాది అని ప్రతివాడు భావిస్తాడు. ఈ గొట్టము నేను కాదు. నాదికాదు అని చెప్పటం ఎంత తేలికో దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటం అంతకష్టం.

అంతకష్టతరమైన అనుభవం కూడా సమర్థులైన గురువుని ఆశ్రయించినప్పుడు అది సులభమవుతుంది. ఈ ఉపాధి నాది, నేను, అనే భావనే దేహవాసన. ఇది నాది అని భావించినప్పుడు ఎంత సాధకుడైనా ఈ దేహాన్ని అభిమానించక మానడు దీనిని దేహాభిమానము అంటారు. నాది అని భావన కలిగినప్పుడు దానిపైన ప్రేమ, అభిమానము పెరగక తప్పదుకదా! దేహాభిమానం జయించటం చాలా దుర్లభము. ఇది జన్మజన్మల నుంచి సంక్రమించిన వాసన. గురుమూర్తి అనుగ్రహము లేనిదే జన్మాంతర వాసనలని జయించటం చాలా కష్టం.



నువ్వు భోజనం చేసిన వెంటనే ఎంత చెయ్యికడుక్కున్నా చేతికున్న ఆవకాయ వాసన, సాంబారు వాసన పోదుకదా! మరి జన్మజన్మల నుంచి సంక్రమించిన వాసన ఎలా పోగొట్టు కోగలుగుతారు? అందువలననే ఉచ్చరించటం ఎంత తేలికో అనుభవించటం అంత కష్టం. దేహవాసన గురించి, దేహాభిమానం గురించి స్టేజి ఎక్కి ప్రేక్షకులకు ఆనందం కలిగించే విధంగా ఉపన్యాసాలు ఇవ్వవచ్చు. కాని అనుభవంలోనికి తెచ్చుకోవటం కష్టసాధ్యం. అందువలననే మా పోతనామాత్యుడు సెలవిచ్చినట్లు, లోకంబులు, లోకేశులు, లోకస్థులను దాటినప్పుడు కదా నువ్వు కాంతిని దర్శించగలిగేది. నీ దేహము ఈ జగత్తులోనిదే కదా అందువలన ఈ దేహభావన ఉన్నంతవరకు ఆత్మదర్శనాన్ని పొందజాలవు. దానిని పొందడానికి గురు శిక్షణ ఎంతో ఆవశ్యము. గురు శిక్షణలో పరిపూర్ణ విశ్వాసంతో సాధన చేసినట్లయితే తప్పక దేహ భావన నీవు అధిగమించగలుగుతావు. పరిపూర్ణ విశ్వాసం సాధించడం చాలా దుర్లభం అన్నారు.

శ్రీ బాబుజీ మహరాజ్ చాలా గంభీరంగా మాట్లాడుతూ సాధకులకు గురుమూర్తి యెడల ప్రేమ, అభిమానం ఉండవచ్చు. ఆయనను దర్శించాలని

ఆకాంక్షించవచ్చు. ఆయన బోధ వినాలని ఆసక్తి వుండవచ్చు. ఆయనతో సత్సంగంలో పాల్గనడానికి ఉత్సాహము చూపించవచ్చు. ఆయనను, ఆయన బోధను అభిమానించవచ్చు. అంతమాత్రంచేత అది పరిపూర్ణ విశ్వాసం అనిపించుకోదు సుమా! నీ ఇంద్రియాలు నీ అదుపులో లేనంత వరకు అది ఇంద్రియ నిగ్రహం అనిపించుకోదు కదా! ఇంద్రియ నిగ్రహం సాధించినపుడే నీ మనస్సు నిశ్చల స్థితిని పొందుతుంది. అప్పుడు కదా గురుమూర్తి యందు నీ విశ్వాసము పరిపూర్ణము అనిపించుకొనేది. నీ మనస్సు ఏ ఇంద్రియానికి దాస్యం చేసినా, బానిస అయినా నీ విశ్వాసం ఎంతవరకు? గురుగీత ఏమి చెబుతోంది? "గురోరన్యం న భావయేత్" దాని అర్థం మనస్సులో గురువు మినహా దేనికి స్థానం లేదన్నమాట.

గజేంద్రుడు ఆ స్థితిలో వుండి ప్రార్థించినపుడే రక్షింపబడ్డాడు. ఆ స్థితిలో వున్న సాధకునికి మిత్రత్త్వము, శతృత్త్వము అనేవి ఉంటాయా! ద్వైత భావము ఉండదుకదా! అట్టిసాధకుడు ఏ పనిచేస్తున్నా దేశ విదేశాలలో ఎక్కడ వున్నా తన భావములో గురుమూర్తి మినహా ఇంకేది వుండదు. సాధన సక్రమంగా చేసే ఏ సాధకునికైనా, గురుకృప వర్షించి సాధన పురోగమిస్తుంది. సాధనకు పరిసరాలుగాని, సంసారం గాని, దారాపుత్రాదులుగాని, గృహస్థాశ్రమంగాని, శబ్ద, స్పర్శ, రూప, రస, శ్రీ అవరోధంకాదు. సాధనకు ప్రధాన అవరోధం ప్రయత్నలోపం. పురుషప్రయత్నం లేకుండా సాధన ఫలించదు అన్నారు. శ్రీ బాబూజీ మహరాజ్.

*

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం, హైదరాబాదు శాఖ

శ్రీమాతాజీవారి సత్సంగ సమావేశములు

12-9-13 గురువారం నుండి 16-9-13 సోమవారం వరకు
శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానం, సెవెన్‌హిల్స్ అపార్ట్‌మెంట్ ప్రక్కన,
నిజాంపేట రోడ్, కుకట్‌పల్లి, హైదరాబాదు - 500 085
సాయంత్రం 5గం. నుండి 8గం. వరకు సంకీర్తన, ప్రార్థన
పూజ్యశ్రీ మాతాజీవారి బోధామృతము

ఉదయం కార్యక్రమములు
4గం. నుండి 4.30 ని॥ల వరకు సుప్రభాతం
4-30 ని॥ల నుండి 6గం. వరకు ధ్యానం, ప్రార్థన
9 గం. నుండి 12గం. వరకు సంకీర్తన
మాతాజీవారిచే తీర్థ ప్రసాదములు

అడ్రస్ : ప్లాట్ నెం. 803, ఇ-బ్లాక్ వర్‌టెక్స్
సద్గురు కృప అపార్ట్‌మెంట్స్
నిజాం పేట రోడ్, కుకట్‌పల్లిలో జరుగును

విశేష కార్యక్రమములు
15-9-13 ఆదివారం
ఉ॥ 10గం. నుండి 12 గం వరకు
శ్రీమాతాజీవారి ప్రసంగం

అడ్రస్ : క్లబ్ హౌస్, మల్టీపరపస్ హాల్,
సద్గురు కృప అపార్ట్‌మెంట్స్
నిజాం పేట రోడ్, కుకట్‌పల్లిలో జరుగును

వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 99856 66797

# శ్రీ మాతాజీ అభిభాషణ

-జపమాలా ప్రసాద

(గతసంచిక తరువాయి)

"ఓం అనే శబ్దాన్ని ముందుగా ఎందుకు ఉచ్చరించాలి?"

శ్రీమాతాజీ:

"మనం ఈ ప్రపంచంలో అనేక శబ్దాలకి అలవాటు పడిపోయి వున్నాం. అందుకని, అనేక శబ్దాల వెంట పరుగులు పెడుతూ చంచలంగా వున్న మనస్సుని ఒక మార్గంలో పెట్టడం కోసం, 'ఓం' అనే ఒక శబ్దం మీద నిలబెట్టడానికి ప్రయత్నం చేయాలి. ధ్యానంలో లోపలికి వెళితే ఆ ఓం అనే శబ్దం కూడా ఉండదు. కేవలం నిశ్శబ్దం మాత్రమే ఉంటుంది.



ఇక్కడ మీకొక చిన్న ఉపమానం చెప్తాను. చంటిపిల్లలు నిద్రపోకుండా అల్లరిచేస్తూ కాళ్ళు చేతులూ కొట్టుకుంటూ గుక్కపెట్టి ఏడుస్తూ ఉంటే తల్లి ఏం చేస్తుంది? వాడి ఏడుపు ఆపటానికి, ఆ తల్లి తన పిల్లవాడిని తన ఒడిలో వేసుకుని, చక్కగా జోకొడుతూ, జోలపాట పాడుతుంది. అప్పటివరకు ఏడ్చి అల్లరిచేస్తున్న పిల్లవాడికి, తన తల్లిపాడుతున్న జోలపాట మనస్సుకి హాయినిచ్చి, మెల్లగా నిద్ర బుచ్చుతుంది.

ఆ జోలపాటలో మనస్సుకి హాయిని, ప్రశాంతతని ఇచ్చి, పిల్లవాడి ఏడుపుని మాన్పించి, నిద్రని తెప్పించేది ఏదో ఉందన్నమాట. అదేవిధంగా, అనేక శబ్దాలకి అలవాటుపడి పోయి, అశాంతి పాలవుతున్న చంచలమైన మనస్సుకి మనం వుచ్ఛరిస్తున్న ఓంకారం, ప్రశాంతతనిస్తుంది. బయట శబ్దాలనుండి తప్పించి, ఓంకారాన్ని అనడం మనస్సుకి అలవడుతుంది. ఓంకారాన్ని నాభినుండి మొదలుపెట్టి ఉచ్చరించాలి. మెల్లమెల్లగా సాధన చేయగా చేయగా, మనస్సు ఆ ప్రణవంలో లీనమై, హాయిని అనుభవిస్తుంది. అదే నిజమైన నిద్ర. అదే సమాధి స్థితి.

2వప్రశ్న:

ప్రార్థన అంటే బాహ్యమైనది, ధ్యానం అంటే అంతరంగమైనది కదా. అవిరెండూ ఒకటేనన్నారు మీరు. వాటిద్వారా ఏమి పొందుతాం? వాటి లక్ష్యాలు ఏమిటి?

శ్రీమాతాజీ:

"ఆకలి వేసినప్పుడు, అడగటానికి మాట కావాలి. ఆకలి తీరడానికి కొంత ప్రయత్నం కావాలి. ఆ ప్రయత్నం చేసి, మనం ఆహారం తినేశాక మన కడుపునిండి,

ఆకలి తీరుతుంది. 'ఆకలి' అనేది ఎవరికీ కనబడదు. కానీ మనం 'అన్నంకావాలి' అని అడగటం వినబడుతుంది. దానికోసం చేసే ప్రయత్నం 'వంట' రూపంలో కనబడుతుంది. అది తినేశాక 'కడుపు నిండటం' గాని 'ఆకలి తీరడం' గాని ఎవరికీ కనబడదు. అది అనుభవైక వేద్యం.

అదేవిధంగా బాహ్యంగా భగవంతుడిని 'ఇది కావాలి' అని వేడుకోవటం 'ప్రార్థన'. మన మనస్సు సమాధానపడి ఆనందాన్ని అనుభవించటమే 'ధ్యానం'. ప్రార్థన అనేది బయటకి కనబడేది. ధ్యానానందం ఎవరికి వారికే అనుభవం.

ధ్యాన ప్రార్థనల లక్ష్యం ఏమిటి అని అడిగారు. రెండిటి లక్ష్యమూ ఒక్కటే. శాంతి.

"శాంతి" అనేది బయటికి అనేదికాదు. అది బయటకి కనిపించేదీ కాదు. అది కేవలం అనుభవించేది మాత్రమే. దానిని పొందాలంటే కొన్నిటిని వదిలిపెట్టాలి. మన నడవడికలో కొంచెం మార్పు తెచ్చుకోవాలి. ఈ గది అంతా ప్రశాంతంగానే వుంది. అందరం చాలా చక్కగా ధ్యానముద్రలోనే కూర్చుని వున్నాం. కానీ, లోపల వున్నవాడు దడదడలాడిస్తున్నాడు. నెమ్మది నెమ్మదిగా ప్రయత్నం చేసి ఆ మనస్సుని దారిలో పెట్టడం, "ప్రార్థన". భగవంతునితో మాట్లాడటమే 'ప్రార్థన'. తద్వారా, పలు దిశలుగా పరుగులు పెడుతున్న మీ భావాలు, ఒక్క కేంద్రం మీద నిలబడతాయి. అదే మెల్లగా ఇంకా లోపలికి వెళితే 'ధ్యానం' అవుతుంది.

చూడండి, ఒక పసిపాపాయి వుందంటే, దానికి ఏడవడం ఒక్కటే తెలుసు. కానీ దానికి ఏమి ఇవ్వాలో దాని తల్లికి తెలుసు. పాలే ఈయాలో, బట్టలే మార్చాలో, అన్నీ తల్లి చూసుకుంటుంది. అలాగే ఆ భగవంతుడు లేక అనంతశక్తి కోసం ఏడవడం 'ప్రార్థన'. మనకి ఏ టైముకి ఏది ఇవ్వాలో ఆయన చూసుకుంటాడు.

*

**శ్రద్ధాంజలి**

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, హైదరాబాదు వాస్తవ్యులు అయిన శ్రీమతి లంక ఉషారాణి (మనోజ్‌కుమార్ ధర్మపత్ని) 26-7-2013 శుక్రవారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 59 సంవత్సరాలు. శ్రీసద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము.

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

1.7.85

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ “వంశాన్ని ఉద్ధరించేవాడు ఒకడు ఉంటే చాలు. అలాగే వంశాన్ని నాశనం చేయటానికి కూడా అంతే. ఇది మీ అందరికీ అనుభవంలో ఉన్న విషయేమే కదా. తల్లితండ్రులు పిల్లలను కనగలరు, గాని వారి తల రాతలను కనలేరు కదా! ఆ విషయం అలా ఉంచండి. ఇవన్నీ రోజు చెప్పేవే కదండి కొత్త విషయాలు ఏమి ఉన్నాయి? అని మీరు ప్రశ్నించవచ్చు. నన్ను ఒక ఇంజనీరుగారు ప్రశ్నిస్తూ ‘బాబుగారూ మీ ఉపన్యాసంలో ఎప్పుడూ అరిషడ్వర్గాలు అహంకార మమకారాలు, (మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము) అంతఃకరణ చతుష్టయము గురించే చెబుతారు కదా మీ ఫిలాసఫీలో ఇంతకన్నా ఏమీ లేదాండి?’ అని అన్నారు.



అప్పడు నేను సమాధానం చెబుతూ ‘మా Subject సంగతి అలా ఉంచండి. మీరు ఇంజనీరు కదా! మీ Subject విషయం ఒక ప్రశ్న అడుగుతాను. దానికి మీరు ఏమి సమాధానం చెబుతారో చూద్దాం. మీరు ఎన్ని బిల్డింగులు కట్టించినా ఇసుక, సిమెంట్, ఇటుకరాళ్ళతోనే కడతారు కదండీ. పోని అవి ఏమన్నా మార్చగలుగుతారా, మీరు డామ్ కట్టాలన్నా, బిల్డింగ్ కట్టాలన్నా ఇసుక, సిమెంటు ఎంతెంత కలపాలో అంతే కలుపుతారు కాని దానిని మార్చలేరు కదా! ఒకవేళ మరి మార్చారనుకోండి అది హరి ఓంతత్సతే కదా! మీ Subject అదే కదండీ. ఈSubject కోసం నాలుగు సంవత్సరాల కష్టపడి చదివారు. పాపం మాSubject కూడా అంతే. మేము ఉన్న వస్తువు గురించి చెప్తాం గాని లేని వాటి గురించి ఏంచెప్తామండి? అని చెప్పాను” అన్నారు.

శ్రీబాబు ఇంకొక విషయాన్ని తెలియజేస్తూ “అమెరికాలో ఒక సభలో నేను భావసమాధిని గురించి చెప్పారు. ఒక వ్యక్తి నన్ను ప్రశ్నిస్తూ ‘మీరు భావసమాధి గురించి చెప్పారు. నేను అనుభవంలేనిదే నమ్మను కాబట్టి మీరు నాతో దానిని అనుభవింపజేయగలరా?’ అని ప్రశ్నించారు. ‘ఓ తప్పకుండా అనుభవింప చేయగలుగుతాను. కాని మీరు నేను చెప్పినట్లు చేయగలుగుతారా?’ అని అనగానే

ఆ భక్తుడు కొంచెం మాటలు తడుముకుంటూ 'నేను చేయగలిగినదైతే చేస్తాను' అన్నారు. మీరు చేయగలిగేదే చెప్తాను. మీకు మంత్రాల మీద నమ్మకం లేదు కదా! కాని విశ్వాన్ని అంతా ఆవరించిన తేజస్సు లేక కాంతి ఉందన్న విషయం నమ్ముతారు కదా! కాబట్టి ఒక మూల మామూలుగా కూర్చొని కళ్ళు మూసుకొని ఆ తేజస్సు మీద concentrate చేయండి అన్నాను. ఆయన నేను చెప్పిన విధంగా చేశారు. T.V. లో రంగుల లాగా ముందుగా నలుపు తరువాత నీలం తరువాత తెలుపు వర్ణాన్ని దర్శించినట్లు చెప్పాడు. తేజస్సుని దర్శిస్తున్న భావన కూడా ఉండకూడదని చెప్పాను. ఆ స్థితిని కూడా పొందాడు. ఆ రకమైన సాధన సముద్రపు ఒడ్డున కూర్చొని చేయమన్నాను. అలాగే చేశాడు. Ship వెళ్ళిన శబ్దంకాని సముద్రపు కెరటాల హెూరుగాని వినిపించని స్థితిని పొందాడు. T.V. శబ్దం కూడా వినపడని స్థితికి ఎదిగాడు. అప్పుడు ఆయనకి లక్ష్యార్థాన్ని ప్రసాదించాను. ఆ మంత్రాన్ని ఆయన నోటితో ఉచ్చరింపజేయటానికి నా తల ప్రాణం తోకకి వచ్చింది. ఆ భక్తుడు ప్రశ్నిస్తూ 'రోజూ ఈ సముద్ర తీరానికి వచ్చి సాధన చేయాలంటే ఇక్కడికి రావటానికి చాలా time పడుతుంది' అని చెప్పాడు. నేను సమాధానం చెపుతూ అవసరం లేదు. మీ గృహంలో మీభార్యాపిల్లలు సంసారంలో చేసే శబ్దాలు చాలు, వాటిని అధిగమించండి అన్నాను. చూశారా ఆయన పొందిన స్థితి భావసమాధి. ఆ స్థితిలో ఏ భావమూ ఉండదు. అక్కడ శబ్ద, స్పర్శ, రూప, రస గంధాలకు తావు లేదు. ఈర్ష్య ఆసూయ, రాగద్వేషాలకు అంతకన్నా లేదు. ఒక్కక్షణం భావసమాధి స్థితి పొందిన మహానుభావుడు ఎవరైనా ఉంటే వారి పాద రేణువు నా శిరస్సుపై ధరిస్తాను. ఒక్క నిమిషం భావ సమాధి స్థితిని అనుభవించిన వారికి 6 నెలలు నిదురించవలసిన అవసరం ఉండదు" అని అన్నారు.

*

<u>పరమహంస గురువులను గురించి చెప్పారు</u> -

1. రాయివంటివారు - తానే మునిగేవాడు. తోటివారలను ముంచేవాడు.
2. ఆకువంటివారు - తాను తేలగలడు. ఇతరులను రక్షించలేడు. ఎప్పుడు తీరం చేరగలడో తెలియదు.
3. పడవవంటివారు - తాను తరించి, యితరులను తరింపజేయగలరు.

*వడపోసి నీళ్ళు త్రాగు - గుర్తించి గురువును చేసుకో అన్నాడు <u>కబీరు.</u>*

# శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు

సెప్టెంబర్ 2013

3 మంగళ మాసశివరాత్రి

5 గురు టీచర్స్‌డే, ఉదయం 10గం. శ్రీసద్గురుపాదపూజ

9 సోమ శ్రీవినాయక చవితి తె.జా 5గం.30ని॥ శ్రీసద్గురుపాదపూజ,
ఉదయం 11గం. సాముహిక విఘ్నేశ్వర పూజలు, భక్త సమారాధన.

19 గురు పూర్ణిమ శ్రీసద్గురుపాదపూజ

29 ఆది శ్రీగురుదశమి, సత్సంగసమావేశము, శ్రీసద్గురుపాదపూజ.

అక్టోబర్ 2013

3 గురు మాసశివరాత్రి

5 శని నుండి 16 బుధ వరకు శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాలు

5 శని శ్రీ మాతాజీవారిచే దీక్షా స్వీకారం, అఖండ జ్యోతి ప్రజ్వలనం

6 ఆది నుండి 14 మంగళ వరకు ఆధ్యాత్మిక ప్రసంగాలు, మాతాజీవారి దివ్యబోధ,
శ్రీగురుదేవుల దివ్యదర్శనము బోధ (వీడియో), మ్యూజియమ్

11 శుక్ర మూలానక్షత్రం , శ్రీ సరస్వతి పూజ, శ్రీ జగన్మాత సాముహిక పూజలు

12 శని దుర్గాష్టమి

13 ఆది మహర్నవమి శ్రీ జగన్మాత సాముహిక పూజలు

14 సోమ విజయదశమి నామకరణలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసములు.

15 మంగళ ఏకాదశి ఏకాహం

16 బుధ దీక్షా విరమణ, మంత్రాక్షలతో మాతాజీ ఆశీస్సులు, జగన్మాత ఊరేగింపు,
రాత్రి 8 గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

18 శుక్ర పూర్ణిమ శ్రీమాతాజీవారి జన్మదినోత్సవము, శ్రీసద్గురుపాదపూజ,
భక్తసమారాధన

29 మంగళ శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

(గత సంచిక తరువాయి) # యోగవాశిష్ఠము -సుషుమ్న ప్రసాద

"ఓరామా, నేను నీకు కర్కటి యనే శక్తి వంతమైన బ్రహ్మ రాక్షసి వేసిన చాలా తెలివైన చిక్కు ప్రశ్నలను వివరిస్తాను అవి నీ సందేహాలన్నిటినీ రహితం చేస్తాయి" అని వశిష్ట మహర్షి రామచంద్రునికి వివరించారు.

హిమాలయ పర్వతములలో ఉత్తరదిక్కున శిఖరములందు కర్కటి యనే రాక్షసి నివసించేది. ఆ రాక్షసి కారు చీకటి కంటె నల్లగా, పర్వతమంత ధృడంగా వుండి, దాని బలమైన అవయవములతో, పెద్ద పెద్ద బండరాళ్ళను కూడ తుత్తునియలు చేయగలదు. చెరువంత పెద్ద నోరుతో, వంకర తిరిగిన దంతాలతో, అగ్నిగోళంలో భగ్గుమనే కనుగుడ్లతో, భయానకంగావుండేది. ఆమె ఊరువులు పెద్ద ఖర్జూరపువృక్షాల లాగా వుండేవి, ఆమె ఉరుము లాంటి, వికటాట్టహాసం చేసేది. ఆమె పదునైన వంకర తిరిగిన గోళ్ళు, పదునైన కత్తుల్లా ఉండేవి.



భయానక ఉదరము గల యీరక్కసి యెంత తిన్నా తీరేది కాదు. జంబూద్వీపములో వున్న జీవరాసులన్నిటినీ, ఆహారంగా తీసుకున్నా,యింకా అర్ధాకలిగానే ఉండేది.ఆ రాక్షసి హిమాలయ పర్వతాల కెళ్ళి, అక్కడ ఘోరమైన తపస్సు ప్రారంభించింది. స్నాన మాచరించి ఒంటి కాలిమీద నిలబడి,తన దృష్టిని సూర్య దేవునిపై నిలిపి,నొక వేయి సంవత్సరాలు ఘోరతపస్సు ఆచరించింది. శీతోష్ణములను లెక్క జేయకుండా, తన భారీకాయముతో తపమాచరించింది,

సహస్ర వర్షాలు ఘోర తపస్సు చేసిన తర్వాత బ్రహ్మ ప్రత్యక్షమయినాడు. బ్రహ్మ దేవునకు మానసికంగా సాగిలపడి తనలో తనిలా ఆలోచించింది."నేనొక సూదిలా జీవ సూచికగా మారితే, నేను ప్రపంచములో వున్న జీవరాసులన్నిటిలో సులువుగా ప్రవేశించి,నాకు కావలసినంత ఆహారాన్ని స్వీకరిస్తాను. జీవులరక్తాన్నంతా, నాహృదయానికి తృప్తిగా స్వీకరించి .యెడతెగని, నాజఠరాగ్నిని తృప్తి పరుస్తాను.

ఆమె ఆ విధంగాఆలోచిస్తుండగా,బ్రహ్మ యిలా చెప్పాడు. ఓకర్కటీ, నీభక్తితో నన్ను మెప్పించావు. నీవే వరము కోరుకున్నా తీర్చటానికి సిద్ధంగా వున్నాను. క్రూరులు కలినాత్ములు కూడ తమ ఘోరతపస్సుతో, నన్ను మెప్పించి, వారి యభీష్టమును నెరవేర్చుకోవచ్చు.

అప్పుడు కర్కటి తన్నొక జీవ సూచికగా మార్చమని కోరుకున్నది. బ్రహ్మ వెంటనే తథాస్తు అన్నాడు. నీవిప్పటి నుండి విసూచిగా పిలవబడితావు. ఎవ్వరైతే మురికివాడలో వుండి, వికృతంగా జీవిస్తూ, అశుచికరమైన ఆహారాన్ని స్వీకరిస్తారో, వారి రక్తాన్ని పీల్చి,వారిలో గాస్‌గా తయారయి, వారికి పైత్యమును, పొట్టుబ్బరమును, ప్రేవులకు, ప్లీహానికి, కాలేయానికి, కలరా మొదలగు భయంకర వ్యాధులకు గురిచేస్తావు. అలా అభయమిచ్చి బ్రహ్మ అదృశ్య మయ్యాడు. కర్కటి జీవసూచిక రూపాన్నిదాల్చి. జీవరాసుల శరీరాల్లో ప్రవేశించి, రక్తాన్ని పీల్చివేయటం ప్రారంభించింది. అయినా దాని ఆకలి తీరలేదు. అప్పుడిలా ఆలోచించింది. కఠినమైన హృదయంతో, యింత జీవహింస చేసినా, ప్రయోజన మేమున్నది. అలాంటి జీవితానికి స్వస్తి చెప్పి, మరల తపస్సు చేసి, జ్ఞానాన్ని పొందాలని నిర్ణయానికి వచ్చింది. వెంటనే కర్కటి హిమాలయాలకు వెళ్ళి , మరల సహస్ర వర్షాలు తపస్సు చేసింది. తన పాపము నుండి విముక్తి పొందింది. రాగద్వేషములకు అతీతమై, జ్ఞానోదయమైంది. సత్యమైన జ్ఞానాన్ని పొంది, ఆత్మానందమును సాధించింది.

అప్పుడు బ్రహ్మ తనంతట తానే కర్కటి వద్దకు వచ్చి యిలా అన్నాడు. “నీవు ఆత్మ జ్ఞానాన్ని సాధించి,జీవన్ముక్తురాల వయినావు. ఇక మీదట నీరాక్షస రూపంలోనుండి, ఆత్మజ్ఞానములేని క్రూరులు,హింస ప్రవృత్తిగల వారి శరీరాలను భుజించు. అమాయకులైనవారి వద్దకువెళ్ళి, ఆత్మ జ్ఞానాన్ని ప్రబోధించు. అజ్ఞానులను సన్మార్గములో పెట్టటమే, ఉత్తమములు, మంచివారైన వారి స్వభావము.ఎవరైతే ఆ జ్ఞానమును స్వీకరించరో , వారిని నీవు ఆహారముగ తీసుకొన”మని చెప్పిబ్రహ్మ అంతర్ధానమైనాడు.

కర్కటి అద్వైతపరబ్రహ్మను గూర్చి తీవ్రమైన తపస్సు,ధ్యానముచేసి,అనేక సంవత్సరాలు, నిర్వికల్పసమాధిలో ఉండి పోయింది. తర్వాత మామూలు స్థితికి వచ్చేటప్పటికి, ఆకలి బాధకు తట్టుకోలేక పోయింది. శరీర ధర్మమును అతిక్రమించలేదు కదా. తన ఆకలి తీర్చుకోటానికి జంతువులను సంహరించుటము పాపమని భావించింది. హిమాలయ పర్వతశ్రేణులకు వెళ్ళి అక్కడ వేటగాళ్ళు ఉండే దేశమునకు వెళ్ళింది. బ్రహ్మ అనుజ్ఞప్రకారము అజ్ఞానుల శరీరములను ఆహుతి తీసుకొన వలయునని నిర్ణయించుకొన్నది. అర్ధరాత్రి సమయమున నొక రాజుగారు, ఆయన మంత్రి అరణ్యములో సంచరించుటము చూచింది. ఆ రాజుగారి పేరు విక్రమ వర్మ. తనకు మంచి ఆహారము లభించిందని సంతోషించింది. కర్కటి వెంటనే వారు జ్ఞానులో, అజ్ఞానులో పరీక్షించాలని నిర్ణయించు కొన్నది.

– సశేషం

# గురుకృపా హి కేవలమ్

- రమణ ప్రసాద్

1988లో శ్రీబాబూజీ మహాసమాధి పొందిన తరువాత వారి నిర్ణయానుసారం యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ (వారి పూర్వనామధేయం కుమారి చంద్ర శేషమాంబ) ఆశ్రమపీఠాధిపతిగా ఆశ్రమబాధ్యతలను స్వీకరించారు. శ్రీబాబుజీ వద్ద వారు గడించిన విశేషజ్ఞానం, ఆర్ద్రతతో కూడిన సంకీర్తనా నైపుణ్యం, హిమవత్పర్వతం పైనుండి దూకే గంగా ప్రవాహంలాంటి వారి వాగ్ధాటి అశేష ప్రజానీకాన్ని ఆకట్టుకొన్నాయి.

శ్రీబాబు కొంతమంది ముఖ్యుల సమక్షంలో, “నేను దీక్షాదికాలు ఇచ్చి మిమ్మల్ని ఆధ్యాత్మిక పథంలో నడిపించానని మీరు ఎలా భావిస్తున్నారో, అలాగే ఇకముందు ఈమె (ప్రక్కన ఉన్న కుమారి చంద్ర శేషమాంబను చేతితో నిర్దేశిస్తూ) కూడ నడిపంచగల సమర్థురాలని తెలియజేస్తున్నాను” అన్నారు.

శ్రీబాబూజీ భక్తులు ఎవ్వరూ శ్రీబాబును, శ్రీమాతాజీని ఎన్నడూ వేరుగా చూడరు. వారికి శ్రీబాబు ఎంత గౌరవనీయులో, అలాగే శ్రీమాతాజీవారు కూడా అంత ఆదరణీయులు, గౌరవనీయులు.

శ్రీబాబు ద్వారా అనేక దివ్య శక్తులూ, మహిమలూ అభివ్యక్తమయ్యేవి. వారి సర్వజ్ఞతకు, సర్వవ్యాపకత్వానికి ముగ్ధులైన భక్తులందరూ బాబును మహీతలం పైన మాధవుడుగా భావించేవారు. శ్రీబాబు “నేను కేవలం పోస్టుమ్యాన్‌ను మాత్రమే. అమ్మ (శ్రీకాళీమాత) నా ద్వారా ఏదైనా జరిపిస్తే అది అమ్మ శక్తే. అమ్మ నా ద్వారా ఏదైనా పలికిస్తే, ఆ గొప్పతనం అమ్మది.” అనేవారు. ఏడెనిమిది గంటలు వారి తత్త్వబోధ జరిగేది. చిన్న పిల్లలుకూడా కదలకుండా కూర్చుని వినేవారు. శ్రీబాబు “ఏ శక్తి మిమ్మల్ని ఇలా కూర్చోబెట్టింది? అది అమ్మ శక్తి” అనేవారు.

ఆ అమ్మకు(శ్రీకాళీమాత), బాబుకు ఎలా బేధం లేదో, అలాగే ఈఅమ్మకు (శ్రీమాతాజీ) బాబుకు ఎంతమాత్రం బేధం లేదు. శ్రీ మాతాజీవారితో తమకు కలిగిన అతీంద్రియ అనుభవాలను పొందినవారందరూ ఈ విషయాన్ని రూఢి చేశారు. అమ్మ మటుకు “ఇది గురుదేవులే చేయించుకొన్నారు” అంటారు.

భక్తులు శ్రీమాతాజీవారితో పొందిన అనుభవాలను ఇక్కడ వివరిస్తున్నాను-

డాక్టర్ వెంకట రమణ ప్రసాద్ గారు పొందిన అనుభవాలు -

“1988 అక్టోబర్‌లో నాకు వెంకటగిరి బదలీ అయింది. “వెంకటగిరి

మంచిదే. తిరుమలకు దగ్గర కూడాను. తప్పక వెళ్ళండి" అన్నారు శ్రీబాబు.
శ్రీబాబు- ఆ! ఇదిగో మాట! వెంకటగిరికి వెళ్తున్నారు కదా. అక్కడ మంచి నేత జరీ పంచలు ఉంటాయి తీసుకొని రండి.
ప్రసాదరావుగారు- అలాగేబాబూ! (అని వెంకటగిరికి వెళ్ళిపోయాను)
శ్రీబాబు- వెళ్ళండి! వెళ్ళండి! నేనూ మీతో వెంకటగిరి వస్తున్నాను కదా!అయిదు మంచి జరీ పంచలు తీసుకొని ఉంచండి
ప్రసాదరావుగారు- ఎప్పుడు వస్తారు బాబూ?
శ్రీబాబు- అంత తొందర పడితే ఎలా?ఏది ఎప్పుడు జరగాలో ఇది నిర్ణయకాలంలో జరుగుతుంది.
ప్రసాదరావుగారు- అలాగే బాబూ! తమ ఇష్టం. వెళ్ళి వస్తాను.(అని బయల్దేరబోయాను)
శ్రీబాబు- అలాగే అని వెళ్లిపోతారేమిటి? ఎలాంటి పంచలో? జరీ ఎంత ఉండాలో తెలుసుకోవద్దా?
ప్రసాదరావుగారు - చెప్పండి బాబూ!
శ్రీబాబు - నూలు 120వ నంబరుకావాలి. జరీ కనీసం ఈ మాత్రం వెడల్పు ఉండాలి (అని తాను కట్టుకొన్న జరీ పంచను చూపిస్తూ ) మీరు ఒక మగ్గానికి ఎన్ని పంచలు వస్తాయో అన్ని పట్టుకురండి.
ప్రసాదరావుగారు - అలాగే బాబూ! వెళ్ళి వస్తాను.
శ్రీబాబు - జరీ విషయం మీకు తెలియదు. మోసంచేస్తారేమో? పోనీ! నూలూ, జరీ తెమ్మందామా అంటే వాటి మంచి చెడ్డలు మీకు తెలియవయ్యే.

ఇలా నేను వెళ్ళాలని అడుగులు వేయటం,వారు నన్ను పలకరించటం వల్ల వెనక్కిరావటం నాలుగైదు సార్లు జరిగాక, "సరే! వెళ్ళండి! ఎవరైనా నమ్మకస్తుడిని చూసుకొని పంచ నేయించి తీసుకొని రండి" అన్నారు శ్రీబాబు.

నేను దారి పొడుగునా ఆలోచిస్తున్నాను-

"బాబు ఎవ్వరినీ ఏమీ అడుగరు. ఎవరు ఏది ఇచ్చినా స్వీకరించరు అటువంటిది వారే నన్ను పంచలు తీసుకొని రమ్మనటం ఎంత అదృష్టమో! పైగా వారంతట వారే "నేను వెంకటగిరి వస్తున్నాను" అన్నారు కదా! వెంకటగిరి కొత్త చోటు. అక్కడ నేను సత్సంగం ఏర్పాటు చేయటానికి తగిన వాతావరణము, చోటు లభిస్తాయో! లేదో!" అనుకొన్నాను.

- సశేషం

# లోకనాథంగారి ఏకాదశి

– భోగరాజు భారతి

లేచి వస్తుంటే ఎదురింటి రామదాసుగారు లోకనాథంగారితో నడుస్తూ 'జగన్నాథం బహుయోగ్యుడయ్యా! గీతాచార్యుడు స్థితప్రజ్ఞుడైన వానికి ఏ లక్షణాలు ఉండాలని వివరించాడో, అవన్నీ ఆయనకున్నాయి. మనం ఏం చేస్తున్నాము? ఏకాదశి ఉపవాసాలు బలవంతాన ముక్కుమూసుకుని, నోరుకట్టుకుని ఎప్పుడు తెల్లవారుతుందా ఎప్పుడు తిందామా అని ప్రాణం అంతా పీకుతూనే ఉంటుంది. అందుకే భగవన్నామామృతం లోని అమృతం రుచి చూసిన జిహ్వకు లోక రుచులెందుకయ్యా! ఉపవాసమంటే దైవానికి సమీపంలోనే ఉండటమన్నమాట. అంతేగాని తిండితినటం మానమని కాదు.' అంటూ పరోక్షంగా లోకనాథంగారి జిహ్వా చాపల్యానికి చురక అంటించి వాళ్ళింట్లోకి తప్పుకున్నాడు. 'ఎంతమాటన్నాడు! వీడితస్సాదియ్యా!' అనుకున్నారు మన లోకనాథంగారు.

ఆ రాత్రి ఆయన మినపరొట్టె అల్లం పచ్చడి, బెల్లం పానకం రెండిటితోనూ తింటూ ఉండగా వీధిలో ముష్టివాడి కేక వినబడింది. 'అమ్మా! రోజంతా తిండిలేక ప్రాణాలు కడగంటుతున్నాయి. రవంత కబళం పడేయమ్మా!' అని. సావిత్రమ్మగారు గిన్నెలో అడుగున ఉన్న పిడికెడు అన్నం చేతిలోకి తీసుకుంటుంటే, 'నీకేం మతి లేదా? ఏకాదశిపూట వాడికి ముద్ద పెడతావా? రోజంతా ఉపవాసం ఉన్నవాడు పచ్చి మంచి నీళ్ళైనా తాగడు. ఎంత ధన్యజీవో తెలుసా? అంబరీషుడికన్న అధికుడు వాడు. వాడికి మోక్షం లభిస్తుంటే నువ్వెందుకు పాడుచేస్తావు?' అని కసిరేసరికి, ఆవిడ చేతిలో అన్నం జారి తిరిగి గిన్నెలో పడిపోయింది. ఇంకోసారి, మరోసారి అరచి ముష్టివాడు లాభం లేదనుకుని వెళ్ళిపోయాడు.

వాడి స్వరం క్రమంగా క్షీణించిపోతూ, చివరికి కళ్ళు తిరిగి పడిపోగానే నలుగురూ గుమిగూడారు. అది విని హుటాహుటిన అక్కడికి వెళ్ళిన లోకనాథంగారు చుట్టూ జేరిన జనంతో 'ఆహా! ఏకాదశి నాడు చావు రమ్మనమంటే వస్తుందాండీ! వీడి సంస్కారబలం అటువంటిది. వైకుంఠం నుంచి వీడికి విమానం వచ్చేఉండాలి. వీడికిక పునర్జన్మలేదు' అంటూ యింటి మొహం పట్టారు.

ఇంటికి చేరిన లోకనాథంగారి కొడుకు గోపాలం 'నాన్నా! మన సందులో ఎవరో ముష్టివాడు కళ్ళు తిరిగి పడిపోతే అందరూ చూస్తూ నిలబడ్డారుకాని ఎవరూ పట్టించుకోలేదు. మన జగన్నాథం బాబాయి వాడిని చూసి మొహాన నీళ్ళు జల్లిలేపి, స్పృహ వచ్చాక వాడిని తీసుకెళ్ళి హెూటల్లో భోజనం పెట్టిస్తున్నారు' అన్నాడు సంతోషంగా. అది విని లోకనాథంగారు "వాడికి వైకుంఠ ప్రాప్తి లేదు. ఏం చేస్తాం?" అన్నారు.

*

# పరిప్రశ్నేన సేవయా - పరాశర ప్రసాద్

'బలిచక్రవర్తి ధార్మికతను పరీక్షించటానికి బాలవటువు వామన మూర్తిగా అవతరించి వచ్చిన శ్రీమన్నారాయణుడు ఆయనను శిక్షించటం ధర్మమేనా?' అని లేవనెత్తిన సందేహాన్ని పురస్కరించుకుని, శ్రీ సద్గురుదేవులు ఉద్బోధిస్తూ ......



"బలిచక్రవర్తి సత్వగుణ సంపన్నుడే. అతనిలోని ధార్మికత గొప్పదే. ప్రహ్లాదకుమారుని మనుమడు, రాక్షస వంశానికి చెందినవాడు. దానము చేయటంలో అగ్రగణ్యుడే. కాని, అతని అనుచరులంతా రాక్షసులే. అతను చేసిన పుణ్యం దేవేంద్ర పదవిని తెచ్చిపెట్టే స్థితిని మించిపోయింది.

వామన మూర్తి అవతరించినది బలిచక్రవర్తిని శిక్షించటానికి కాదు. కృతార్థుడిని చేయటానికి. బలిచక్రవర్తిలో అంతర్గతంగా చాలా సూక్ష్మంగా నేనూ, నాది అనే అహం దాగి ఉంది. అది రహితం అయితే అతనిని మించిన ధార్మికుడు లేడు.

తన గురుమూర్తి హెచ్చరిస్తూ "వచ్చిన బాలవటువు కేవలం శ్రీమన్నారాయణుడే" అని చెప్పినా విశ్వసించాడా! శ్రీమన్నారాయణుడే తన వద్ద దానం స్వీకరించటానికి వచ్చాడని తెలిసి కూడా "నీకేమి కావాలో అడుగు" అని ప్రశ్నించటం అహంకార సంకేతం. దాని నిర్మూలన జరిగితేనే అంతటి పుణ్యాత్మునికి ఏదైనా ప్రాప్తించేది. దాని కార్యార్థమే వామనుడు అవతరించినది.

బలిచక్రవర్తిలో అంతర్గతంగా దాగి ఉన్న త్రిపుటిని రహితం చేస్తేనే కదా కృతార్థుడు అయ్యేది. అందుచేతనే వామనుడు తన పాదాన్ని బలిచక్రవర్తి శిరస్సుపై ఉంచి, అహంకారాన్ని హరించి, బుద్ధిని ప్రకాశింపజేసి సమాధిస్థితిని ప్రసాదించాడు.

దేవతలకు సహితం అలభ్యమయ్యే ఆ దివ్యనాథుని పాద స్పర్శ లభించాలంటే ఆయన ఎంతటి పుణ్యాత్ముడో కదా! మరి ఇప్పుడు ఆలోచించండి! బలిచక్రవర్తిని శ్రీమన్నారాయణుడు శిక్షించాడా? రక్షించాడా? అంతేకాదు. బలిచక్రవర్తి పదునాలుగు భువనాలను పరిపాలించే సమయంలో ఆయనకు రక్షకుడిగా శ్రీమన్నారాయణ మూర్తి ఉండే స్థితి ఎవరికి ప్రాప్తిస్తుందయ్యా?" అన్నారు శ్రీబాబు.

*

గత సంచిక తరువాయి

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

29.శ్లో॥ మయి ప్రసాదం మధురైక కటాక్షై
ర్వం శీ నినాదాను చరై ర్విధేహి,
త్వయి ప్రసన్నే కిమిహెూపరైర్న
స్త్వయ ప్రసన్నే కిమిహెూపరైర్నః



తాత్పర్యము -
కృష్ణా! పిల్లన గ్రోవి మ్రోతకు లోనైన ప్రియములైన నీక్రీగంటి చూపులతో నన్ను అనుగ్రహింపుము. నీదయ కలిగితే మాకు ఇతరులతో ఏమి పని? నీ యండ లేనిచో ఎవరి దయ యుండియు ఏమి లాభము?

చల్లనిగాలేస్తుంటే ఇంటిముందు చెట్టు క్రింద పైబట్ట వరుచుకొని వెూచేతిమీద తలాన్చుకుని పరున్నాడు పున్నయ్య. అతడు అదేపనిగా ఆలోచిస్తున్నాడు తనకిన్ని కష్టాలు, నష్టాలు ఎందుకు వస్తున్నాయి? తనే పాపం చేశాడు? తమ సంసారానికి సరిపడ తిండి గింజలిచ్చే కాస్తంత పొలము, ఇంట్లో పుట్టి పెరిగి పెద్దవై పాలిచ్చే గోవులు తమకి పాడీ పంటా అందిస్తుంటే భార్యాబిడ్డలతో సుఖంగా కాలక్షేపం చేస్తున్న తనకి యిబ్బందులు ముంచు కొచ్చాయి.

ముందటేడు పంటనూర్చి కుప్పలు వేసి ఇంటికి చేరటానికి సిద్ధంగా ఉన్న సమయంలో అనుకోకుండా గాలీ వానా వచ్చి బ్రహ్మాండమైన కుంభవృష్టిగా మారి తమ నోటిముందు అన్నం మన్నుగా మార్చేసింది. పున్నయ్య కుప్ప కూలిపోయాడు. నిరుడు పొరుగు వాళ్ళని అడిగి విత్తనాలు తీసుకుని ఏరువాక సాగినాక మెరుపు మెరిసినట్టు ఒక వానజల్లు కురిసి మల్లా వస్తే ఒట్టు. ఎంత కళ్ళు చించుకు చూసినా ఆకాశంలో చాటంత మబ్బయినా కనబడలేదు. వరసగా యిలా అతివృష్టి అనావృష్టితో పంట లేక చితికిపోయాడు. చేతులు ముడుచుకొని యింట్లో కూచోటంతప్ప వేరే పని లేక పోయింది. కంటికెదురుగా పెళ్ళికెదిగివచ్చిన కూతురు గుండెల మీద కుంపటిలాఉంది. ఎప్పటికి తనీ పరిస్థితుల్లోంచి తేరుకోగలడు?

అప్పుడొచ్చింది ఒక ఆలోచన పున్నయ్య బుర్రలో. మధు రానగరంలో తన మేనమామ చెంచయ్య రాజుగారి కొలువులో పనిచేస్తున్నాడు,పోనీ అక్కడికి వెళ్లి పరిస్థితులన్నీ చెప్పివాని నాశ్రయిస్తే! తనకి కూడా కొలువులో ఏదైనా పని యిప్పించగలడేమో! చటుక్కున లేచాడు. నేల మీదున్న ఉత్తరీయం తీసి దులిపి

బుజాన వేసుకొన్నాడు.

కొడుకు నారయ్య గోవుల్ని మళ్ళించుకొనివస్తూ కనిపించాడు. ఆవుల్ని చూస్తే మరో కష్టం గుర్తొచ్చింది. ఈ సమయంలోనే ఆవులు కూడా అలిగినట్లు పాలివ్వటం మానేసేసరికి పాడికి గిలగిల్లాడే పరిస్థితి ఏర్పడింది. అందులో ఒక గోవుకి చూలు నిలవటంలేదు. నెత్తినచెయ్యి పెట్టుకుని ఉసూరుమంటూ యింట్లోకి వెళ్లి భార్యని పిలిచాడు."రేపు ఉదయం మధురానగరానికి వెడుతున్నాను" అని చెప్పాడు. ఎందుకు వెడుతున్నావని ఎదురు ప్రశ్న వెయ్యలేదామె.

తెల్లవారింది. ఎండెక్కింది. కాలికి చెప్పులు చేతిలో కర్ర తలకి గుడ్డ చుట్టుకొని, బయలు దేరాడు పున్నయ్య. మధుర చేరుకొని మేనమామ ఇల్లు వెతుక్కుంటూ వెళ్లాడు. చాలా కాలానికి కనబడిన మేనల్లుణ్ణి ప్రేమగా ఆహ్వానించాడు చెంచయ్య. పున్నయ్య చెప్పుకున్న కష్ట సుఖాలన్నీ విన్నాడు. "అంత అవస్థలు పడుతూ అక్కడ ఎందుకుండటం? నీ కుటుంబముతో వచ్చేసి ఇక్కడ మా యింట్లోనే ఉండు. నీకో పని నేనిప్పిస్తాను. కొంచెం కుదురుకున్నాక యిల్లూవాకిలీ చూసుకుందుగాని" మామ ఆదరణకు పొంగి పోయాడు పున్నయ్య.

ఇంట్లో చెప్పివస్తానని తిరిగి వచ్చాడు పున్నయ్య. జరిగిందంతా భార్యాబిడ్డలకి చెప్పాడు."గోవుల్ని చూసుకుంటూ నేనిక్కడే ఉండి నాతిప్పలేవో నేను పడతాను, నువ్వక్కడ స్థిరపడ్డాక నేనువచ్చి చేరుతాను" అన్నాడు నారయ్య తండ్రితో. నేను కూడా వాడికి తోడుగా ఇక్కడే వుండి వాడేదో తెస్తే నేను మాయిద్దరికీ వండిపడేస్తానయ్యా" అంది వసుమతి బెదురుతూ. పున్నయ్య కి వాళ్లమాటలు నిజమనిపించాయి. "సరే అయితే అమ్మని తీసుకొని నేను వెడుతున్నాను" అన్నాడు పున్నయ్య.

మధురలో నాలుగురోజులు ఉండేసరికి, స్వచ్ఛమైన వాతావరణంలో పుట్టి పెరిగిన పున్నయ్య ఆ నాగరిక వాతావరణంలో యిమడ లేక పోయినా తప్పదు అనుకున్నాడు."పిల్లకేదైనా సంబంధం కూడా చూసి పెళ్లి చేద్దాం" అన్నాడు చెంచయ్య. కొలువులో కుదిరి చేస్తున్న చాకిరీలో రాజభటుల అదిరింపులు, ఉద్యోగుల కేకలు, దండింపులు భరించలేక బాధపడుతూ పున్నయ్య రోట్లో తలదూర్చి రోకటి పోటుకు వెరిస్తే ఎలాగ? అనుకున్నాడు. ఆనోటా ఆనోటా వినగా వినగా కంసరాజు రాక్షసత్వానికి కూడా పున్నయ్యకి ఏవగింపు కలుగుతోంది. కోరివచ్చి తను ఉచ్చులోయిరుక్కున్నాడు. ఇది ఎలాగ వదిలించు కోవటం? అని ఆలోచించ సాగాడు.

– సశేషం

# దీపముండగానే యిల్లు చక్కబెట్టుకో

– రమణ ప్రసాద్

(మౌన ధ్యాన శిబిరంలో చేసిన శ్రీమాతాజీవారి ప్రసంగాల నుండి)

జనక మహారాజు ఆత్మజ్ఞాన సంపద కలిగిన మహాజ్ఞాని. ఏ విధంగా తన తను మనో ధనాలను సమర్పించి, అష్టావక్రులవారిచేత ఆత్మజ్ఞానాన్ని పొందాడో మనం చాలా సార్లు చెప్పుకున్నాము. ఆయన వద్దకు వ్యాసమహర్షి పుత్రుడైన శుకుడు బ్రహ్మము గురించి తెలుసుకోవాలని వచ్చాడు. వ్యాసమహర్షి శుకునికి బ్రహ్మజ్ఞానాన్ని బోధించాడు. కాని యింకా ఏదో ఉంది దాన్ని తెలుసుకోవాలని జనక మహారాజు వద్దకు వెళ్ళాడు,

జనకుని రాజమందిరం ద్వారం వద్ద ఏడురోజులు నిలబడ్డాడు. శుకుని దృష్టి బ్రహ్మం మీద కేంద్రీకరింపబడి ఉంది. కనుక అతను చలించలేదు. ఆ తరువాత రాజ మందిర ప్రవేశం జరిగింది. అక్కడ పరిచారకులు సకల సేవలను అందించటానికి సిద్ధంగా ఉన్నారు. నృత్య గానాలను ప్రదర్శించారు. దేనికీ ఆయన చలించలేదు. అప్పుడు జనక మహారాజు శుకుని వద్దకు వచ్చి నమస్కరించి “స్వామీ! మీరు ఏ ప్రయోజనం కోరి నా వద్దకు వచ్చారు?” అని అడిగాడు. శుకుడు బ్రహ్మకార వృత్తిలో ఉండి ఆయనకు అడగాల్సిన ప్రశ్న లేకపోయింది. ‘నేను అడగాల్సింది ఏమీలేదు వెళ్ళి వస్తాను’ అని జనకుని వద్ద శలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

గురుబోధను చక్కగా శ్రవణం చేయాలి. ఆ విన్నది మననానికి రావాలి. తనదైన తరించే విషయం గురించి బోధలో ఉండేది గుర్తిస్తే కలిగేది బ్రహ్మానందమే. అదే ప్రజ్ఞానం, అదే చైతన్యం. అది అనంతంగా ప్రకాశిస్తోంది.

సర్వచైతన్య రూపాం తాం ఆద్యాం విద్యాంచ దీమహి
ధియో యానః ప్రచోదయాత్

నీలో ఏది ఉందో అది అందరిలోనూ ఉంది. కొన్ని కుండలలో నీరు పోస్తే చంద్రుడు ఆ కుండలన్నిటిలో ప్రకాశిస్తాడు. చంద్రుడు ఒక్కడే. కాని అన్ని ఘటాలలోను భాసిస్తాడు. అలాగే పంచభూతాత్మకమైనది యీ శరీరం. ఇందులో ఉన్న చైతన్యమే సకల భూత జాలములలో ప్రకాశిస్తోంది. ఆ చైతన్యాన్ని గుర్తింపజేసే వారే గురుదేవులు. మనలో ఉన్న అజ్ఞానమనే తిమిరాన్ని జ్ఞానమనే శలాక ద్వారా తీసివేసి మనలను జ్ఞానవంతులుగా చేస్తారు. ఇట్టి స్థితిని బ్రతికి ఉండగానే పొందాలి. అదే జీవన్ముక్త స్థితి. ఈ జీవితం ఉండగానే మనం మనను చక్కదిద్దుకోవాలి.

దీపముండగ యిల్లు దిద్దుకోలేవా? చీకటిలో ఒంటిగా చిందులాడేవా?

నీ కంటిలో కాంతి కరిగిపోవక మున్నే సృష్టిలో అందాలు అనుభవించాలి. అందాలలో హరి దాగి ఉంటాడు. అందుకే అందాలు అనుభవించాలి.

నీ చెవులలో ధ్వనులు చెదరిపోవక మున్నే సృష్టిలోని ధ్వనులను ఆలపించాలి. ధ్వనులలో శ్రీ హరి మెదలుతుంటాడు. అందుకే ధ్వనులను ఆలపించాలి.

నీ కంఠమున శ్రుతులు మూగబోవక మున్నే సృష్టిలో రాగాలు ఆలపించాలి. రాగాలలో శ్రీహరి వేచి ఉంటాడు. అందుకే రాగాలు ఆలపించాలి.

నీ తనువు నేలపై రాలిపోవక మున్నే సృష్టిలో ప్రాణులను ప్రేమతో చూడాలి. ప్రేమలో శ్రీహరి నిండి ఉంటాడు. అందుకే ప్రాణులను ప్రేమతో చూడాలి.

అందుకే దీపం ఉండగానే యిల్లు చక్కబెట్టుకోవాలి. ఈ శరీరం ఉండగానే నీ కనులకు కన్నుగా, నీ చెవికి చెవిగా ఉన్న చైతన్యాన్ని గుర్తించాలి. కాబట్టి నువ్వు ధర్మపరంగా నీ జీవితాన్ని గడుపుతూ మనసు లేకుండా ఆచరించే కర్మ, కర్మలో అకర్మ అవుతుంది. ఉన్న స్థితిలోనే సద్భావన కలిగి మంచినే చేస్తూ, మంచినే చూస్తూ, మంచినే ఆలోచిస్తూ ఉండు. విశ్వాసం పెంచుకో. మన గురుదేవులు చూపిన మార్గంలో నడచి అంతఃకరణ పవిత్రత కలిగి ఉండు.

అటువంటి గొప్ప ఆత్మఫలాన్ని మనమందరమూ అనుభవించే శక్తిని, భక్తిని శ్రీగురుదేవులు మనకు ప్రసాదించెదరు గాక! సుఖీభవ! సుఖీభవ!!

## తంతు

ఒక గృహస్థుడు పూజ చేస్తున్నాడు. కొట్టిన కొబ్బరి చిప్ప ఎత్తుకు పోవటానికి పిల్లి సిద్ధంగా ఉంది. అది గమనించిన పురోహితుడు ఒక గంప తెప్పించి, పూజ పూర్తి అయ్యేదాకా పిల్లిని దాని క్రింద దాచి పెట్టాడు. ప్రతి యేడూ యిదే పద్ధతిలో పూజ జరుగుతోంది.

కొంతకాలానికి ఆ పురోహితుడు మరణించగా, మరొక మంచి విద్వాంసుడు వేరొకరు పురోహితుడుగా వచ్చాడు. ఆయనకు గంప క్రింద పిల్లిని దాచే పద్ధతి తెలియదు. దానితో అది పెద్ద లోపంగా భావించాడు ఆ గృహస్థుడు.

విషయం తెలుసుకున్న ఆ నూతన పురోహితుడు తాను కూడా ఒక గంప తెప్పించి పిల్లిని దాని క్రింద దాచిపెట్టాడు. అప్పుడే పూజ సక్రమంగా జరిగినట్లుగా వారు భావించారు. చాలా వరకు తంతు యిలాగే నడుస్తుంది.

(గత సంచిక తరువాయి)

# సర్వము నీ దయ

- సుశీలా ప్రసాద

చివరికి ఏమీ పాలుపోక తలవంచుకొని నిలచిన రాజుకు హటాత్తుగా ఒక విషయం గుర్తుకొచ్చింది. ఆ సరస్సుకి సమీపంలోనే తన ఆజ్ఞపైన ఈ మధ్యలో రాజవన పాలకుడైన చారుగుప్తుని కోసం నిర్మించిన భవనం ఉంది. ఆక్కడికి గనుక తను ఏదో విధంగా చేరుకొన్నట్లయితే, తన సేవకుడైన ఆతడు తన చక్రవర్తికి తగిన రాజోప చారాలను తప్పక భక్తి శ్రద్ధలతో చేస్తాడు. ఈ ఆలోచన రాగానే కలతపడిన రాజు మనస్సు కాస్త తేరుకుంది. వెంటనే వడివడిగా ఆభవనంవేపు నడవసాగాడు. ఆనడక చక్రవర్తికి అమిత దుఃఖం కలిగించింది. కిరీటమూ ఛత్రమూ లేనందున ఎండవేడికి శిరోవేదన అధికమై పోయింది. కొద్దికాలం క్రితం తన సామ్రాజ్యంలో కెల్లా సుందరమైన అశ్వానెక్కి ప్రయాణం చేసిన తను యిప్పుడు కాలికి పాదుకలు కూడా లేకుండా కటిక నేలపైన ఎండలో నడుస్తూ పోవలసి వచ్చింది.ఈ విపరీత సంఘటనలకి రాజు మతి భ్రమించ సాగింది. ఎలాగో మనస్సు చిక్కబట్టుకుంటూ వనపాలకుని భవనంలో మెత్తని దుస్తులు ధరించి సుఖాసీనుడై చారుగుప్తుడు అతని సేవకులు తనకందించే రుచికరమైన భోజనాన్ని ఆరగిస్తూ సపర్యలలో విశ్రాంతి పొందుతూయిప్పటి యీ దుస్థితిని మర్చిపోవచ్చు నని ఆలోచిస్తూ శ్రీవర్ధనుడు ముందుకి నడిచాడు.

అతి ప్రయాసతో చారుగుప్తుని భవంతి సింహ ద్వారం దగ్గరచేరి మూసిఉన్న తలపులను తట్టి పిలవసాగాడు. కొంచెంసేపటిలో ఒక సేవకుడు తలుపులను తెరిచాడు. వెంటనే శ్రీవర్ధనుని నగ్నదేహాన్ని చూస్తూ పరిహాస స్వరంతో "మేము మానవ చర్మాలేమీ కొనబోవటంలేదు గనుక నీ వళ్ళు మాకు చూపనవసరంలేదు. ఇంటికి పోయిదుస్తులు ధరించు" అంటూ పకపక నవ్వాడు. ఆమాటలు వింటూ శ్రీవర్ధన చక్రవర్తి నిశ్చేష్టుడైనాడు. విశాల సామ్రాజ్యాధినాథుడై అపర కుబేరునికి భోగభాగ్యాలతో తులతూగే తనతోనా ఒక సేవకాధముడు పరిహాసమాడటం? చక్రవర్తి కనుకొలకులు ఎర్రబడి కోపంలో అగ్నికణాలు వర్షించాయి. "నీచుడా! నీ ఎదట ఉన్నది చక్రవర్తి అయిన శ్రీవర్ధనుడని గుర్తించలేదా? తన ప్రభువు దస్తులూ, ఆహారమూ విశ్రాంతీ కోరుతూ యీ భవనానికి అతిథిగా వచ్చారని మీ యజమాని అయిన చారుగుప్తునికి తెలియచెయ్యి! నీ తొందరపాటుకి క్షమాభిక్ష లభించాలంటే తక్షణమే యీవార్తను వానికందించు ఫో!" అన్న శ్రీ వర్ధనుని గంభీర కంఠధ్వని మేఘ గర్జనవలే వినబడింది. ద్వారపాలకుడు మరోమారు విరగబడి నవ్వాడు. తలుపులు తెరచి నిన్ను చూడటం మొదలుకుని యిదంతా ఒక పీడకల కాబోలు! నీ అదనపు ఆలోచనలన్నీ కట్టి పెట్టి యిక్కడినుంచి పో వెర్రివాడా!" అంటూ ఆసేవకుడు పెద్దచప్పుడుతో తలుపులను మూసివేశాడు. ప్రపంచమంతా గిర్రున తిరిగినట్లయింది. నిజంగానే తననాసేవకుడు గుర్తుపట్టలేదా? ఇదంతా ఒక నాటకమా? లేక శత్రువులు పన్నిన పన్నాగమా? ".

PRICE LIST

# సమర్థ సద్గురు పబ్లికేషన్స్

## శ్రీ కాళీగార్డెన్స్ - 522508, నంబూరు

## గుంటూరు జిల్లా. ఫోన్: 08632293206

**తెలుగు పుస్తకములు:**

| | | |
|---|---|---|
| 1. శ్రీ భగవద్గీత సాధనా దీపిక | 3 భాగములు | రూ: 120.00 |
| 2. శ్రీ సద్గురునాధుని దివ్య చరిత్ర | 1వ భాగము | 90.00 |
| 3. శ్రీ సద్గురునాధుని దివ్య చరిత్ర | 2వ భాగము | 100.00 |
| 4. శ్రీ బాబూజీ | | 80.00 |
| 5. శ్రీ గురుగీత | | 80.00 |
| 6. స్తోత్రమంజరి | | 60.00 |
| 7. శ్యామసుందరా ఒక్కసారి.... | | 50.00 |
| 8. సంత్‌నామదేవ్ | | 50.00 |
| 9. వార్తాలాపము | 1వ భాగము | 50.00 |
| 10. వార్తాలాపము | 2వ భాగము | 50.00 |
| 11. భక్తికుసుమాలు | | 40.00 |
| 12. భజనమాల | | 70.00 |
| 13. భజనమాల | 1వ భాగము | 25.00 |
| 14. గురువాణి | 1వ భాగము | 25.00 |
| 15. గురువాణి | 2వ భాగము | 10.00 |
| 16. గురువాణి | 3వ భాగము | 25.00 |
| 17. శ్రీ బాబూజీ బోధామృతం | 2వ భాగము | 10.00 |
| 18. శ్రీ బాబూజీ బోధామృతం | 3వ భాగము | 10.00 |
| 19. శ్రీ బాబూజీ దివ్యస్మృతులు | 2,3,6,7 భాగములు | |
| | ఒక్కటికి | 10.00 |
| 20. శ్రీ బాబూజీ దివ్యస్మృతులు | 8,9 భాగములు | |
| | ఒక్కటికి | 15.00 |
| 21. సద్గురు లేఖ సుధ | | 10.00 |
| 22. ధ్యాన శ్లోకమంజరి | | 20.00 |
| 23. తత్వార్థచంద్రిక | 1వ భాగము | 15.00 |

| | | |
|---|---|---|
| 24. తత్వార్ధచంద్రిక | 2వ భాగము | 25.00 |
| 25. కైలాస మానస సరోవరయాత్ర | | 20.00 |
| 26. బాబుమాట అమ్మనోట | | 15.00 |
| 27. ధ్యానం | | 15.00 |
| 28. స్తుతి మంజరి | | 20.00 |
| 29. గురుధ్యానదీపిక | | 15.00 |
| 30. గురురామకోటి | | 10.00 |
| 31. శ్రీ గురుగీత | | 10.00 |
| 32. భక్తిపుష్పము | | 10.00 |
| 33. శ్రీ బాబూజీ సహస్రనామాలు | | 8.00 |
| 34. శ్రీ మాతాజీ సహస్రనామాలు | | 8.00 |
| 35. సుప్రభాతం - ప్రార్థన | క్రొత్తది | 6.00 |
| 36. సుప్రభాతం - ప్రార్థన | పాతది | 4.00 |
| 37. బాబు తత్వం అమ్మనోట | | 5.00 |
| 38. నమస్కార స్తోత్రం | | 5.00 |
| 39. ముకుందమాల | | 5.00 |
| 40. శ్రీ దేవీ స్తోత్రరత్నమాల | | 5.00 |
| 41. దివ్యసన్నిధి | | 5.00 |
| 42. గురువే భగవంతుడు | | 5.00 |
| 43. ప్రార్థన - సుప్రభాతం | హిందీ | 5.00 |
| 44. చిన్న పుస్తకములు | ఒక్కటికి | 2.00 |

**<u>ENGLISH BOOKS</u>**

| | | |
|---|---|---|
| 1. Divine memories of Sri Babuji | 2parts each | 10.00 |
| 2. Divinity in Human Form | | 10.00 |
| 3. Guru is God | | 5.00 |
| 4. Gospel of Meditation | | 10.00 |
| 5. Samardha Sadguru | | 50.00 |
| 6. Small books | each | 2.00 |

# చందాదారులకు విజ్ఞప్తి

చందాదారులు కొంతమంది 'సమర్థసద్గురు మాసపత్రిక' తమకు చేరటం లేదని మాకు ఫోన్ చేస్తున్నారు. మేము పత్రిక డిశ్పాచ్ చేసేవరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాము. జిల్లావారీగా సార్టింగ్, కౌంటింగ్ చేసి ఇక్కడ గుంటూరు ఆర్.ఎమ్.ఎస్ వారి దగ్గరకు చేరుస్తున్నాము. మాసపత్రిక చదవాలనే మీ ఆసక్తికి ఆనందము, పుస్తకము చేరటంలేదని విచారము కలుగుతున్నవి. గుంటూరు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వారిని సంప్రదిస్తే వారు 'చందాదారులనుండి మాకు కంప్లయింట్ అందితే మేము ఇన్స్పెక్టర్‌ను పంపి తప్పక చర్య తీసుకోగలము' అన్నారు. కావున చందాదారులు మాకు అందలేదని ఫోన్‌చేస్తే మేము మరొక పుస్తకము మీకు పంపగలము. కానీ పత్రిక మీకు సక్రమంగా చేరాలంటే మీరు వెంటనే మాకు కంప్లయింట్ ఈ క్రింది విధంగా రాసి పంపగలరు............

సమర్థ సద్గురు తెలుగుమాసపత్రిక యాజమాన్యం వారికి -

నేను .........**AS NO**..,.. లేదా **LM NO.** .......... గల చందాదారుడను. ........ నెల పత్రిక మాకు అందలేదు. కారణము తెలియుదు. ఇక్కడ మా పోస్ట్‌మాన్ ..........పోస్ట్‌మాస్టర్ ........ పోస్ట్ ఆఫీస్ బ్రాంచ్ .........వారిని సంప్రదించగా మాకు ఈ క్రింది విధంగా సమాధానం చెప్పినారు..... ....... మాకు మిగిలిన ఉత్తరములు సక్రమముగానే అందుచున్నవి. కావున గుంటూరు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వారికి ఫిర్యాదు చేయవలసినదిగా కోరుచున్నాము.

నా అడ్రస్ పూర్తి వివరములతో.............

పేరు ........ **AS NO** లేదా **LM NO.**........

ఇంటి నెం........ వీధి పేరు......... గ్రామం పేరు...... జిల్లా......

పిన్ కోడ్ నెం........ ఫోన్ నెం. సెల్...... లాండ్‌లైన్ నెం............

**పాఠకులారా! మీ సభ్యత్వాన్ని గడువుకు ముందే రెన్యూ చేసుకోండి!**

మీ సభ్యత్వం ఏ తేదీ వరకు ఉన్నదో తెలియజేస్తూ సమర్థ సద్గురు పత్రిక కవర్ మీద వ్రాస్తున్నాము. దానిని గమనించి మీరు సకాలంలో మీ మెంబర్‌షిప్‌ను రెన్యూ చేసుకున్న యెడల మీకు నిరాటంకంగా పత్రికను పంపగలము. చందాను ఈ క్రింది ఎడ్రస్‌కు పంపగలరు. బ్యాంక్ డ్రాఫ్ట్సు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్ట్సు పంపవలసిన చిరునామా ...........................

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్, నంబూరు పోస్ట్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

గుంటూరు జిల్లా

# ఏకాగ్ర దృష్టి

– వశిష్ఠ

నేడు ఏకాదశి. మన దశేంద్రియాలకు అంతఃకరణ చతుష్టయాలకు, త్రిగుణాలకు అధిష్ఠాత్రియగుటయేకాక, వాటికతీతురాలు కూడా అగుచు ఏకమేవ అద్వితీయం బ్రహ్మగా ప్రకాశించే జగజ్జననిని మనం ఎప్పుడు చూడగలుగుతాము? మన మనస్సు ఈ పైన చెప్పిన వాటినన్నిటికి అతీతము కాగలిగినప్పుడే.



నేనెవరిని? అని ప్రశ్నించుకోవటం ద్వారా నిత్యానిత్య వివేకం కలిగి ఈ శరీరము, మనస్సు, బుద్ధి, అహంకారము నీవు కాదని తెలుసుకో. ఎందుకంటే గాఢ నిద్రలో పైన చెప్పినవన్నీ లీనమై, ఏ ప్రవృత్తి లేక ఉన్నప్పుడు ఆ మనస్సు సుషుప్త్యానందాన్ని అనుభవిస్తూ నీవు ఉన్నావు. నేతి; నేతి; – ఇది కాదు, ఇది కాదు, అని ఉల్లిపాయలోని పొరలవలె నిషేధింపబడగా చివరకు మిగిలేది సాక్షియైన తను మాత్రమే. అది నీవు 'తత్వమసి'.

జగత్తు యొక్క నిజ తత్వమును విచారించగా ఇదంతా స్వప్నము వంటిదని తేలుతుంది. నిద్రపోయినప్పుడు నీకు స్వప్నం వస్తుంది. అందులో దొంగలు నిన్ను దోచుకున్నట్లు అనుభవం కలుగగా నీవు ఏడుస్తావు. కళ్ళనీళ్ళతో నీ చెక్కిళ్ళు తడుస్తాయి. మెలుకువ వచ్చినప్పుడు ఆ దొంగలుకాని, వారు దోచుకోవటం కాని, నిజంకాదని తేలుతుంది. నీ ఆస్తి అంతా భద్రంగా ఉంటుంది. చెక్కిళ్ళు మాత్రం తడిసి ఉంటాయి. నిద్రపోకుండా మెలకువగా ఉన్నప్పుడు, ఎరుకే నీకు ఉన్నట్లు నీవు అనుకుంటావు. చుట్టూ ఉన్న ప్రపంచ దృశ్యమంతా నీకు కనిపిస్తూ ఉంటుంది. వాస్తవానికి యిది కూడా ఒక విధమైన నిద్ర. నీవు చూసే ప్రపంచమంతా నీ నిద్రలోని స్వప్నమే. నిత్యానిత్య వివేకం ద్వారా నీకు జ్ఞానోదయం. ఈ నిద్రలో నుంచి మేలుకొన్నప్పుడే జ్ఞానరూపమగు ఎరుకలో సమస్త ప్రపంచమూ స్వప్నమువలె భాసిస్తుంది. మనసు శుద్ధమై అంతటా, అన్ని వస్తువులను దర్శించగలుగుతుంది. నీవే ఆత్మ వస్తువుని తెలుసుకోగలుగుతావు. వాస్తవానికి యీ జగత్తు అనేది నీకు జ్ఞానోదయం కలగటానికి పూర్వమందు గాని, పరమందుగాని, తెలియలేదు. మరి ఉన్నట్లుగా యీ అనుభవం ఎలా వచ్చింది? సంజచీకటిలో తాడును చూసి పాము అనుకొన్న అనుభవం వంటిదే కాని మరేమీ కాదు.

ఆత్మ సర్వవ్యాపకంగా, అంతర్యామియై ఉండి, దాన్ని ప్రకాశింప జేస్తుంది. జ్ఞాని యీ పై పూతను శాశ్వతమైన ఆత్మను సాక్షాత్కరించుకుంటాడు. సరియైన సాధకుడు జాగరూకుడై ఉండి, మాయ కల్పించే భ్రమలకు లోబడటం నేర్చుకోవాలి. విమానం నడిపే పైలెట్ జాగరూకుడై విమానం నడపకపోతే ఏమౌతుంది? సర్వవినాశమే కదా. వ్యాపార రంగంలోకాని, వ్యవసాయ రంగంలోకాని, మరే యితర వృత్తులలో కాని అశ్రద్ధ, సోమరితనము, ఆ యా వృత్తులలో సంపూర్ణ వైఫల్యమునకే కారణం అవుతుంది.

అట్టివారు భ్రష్టజీవులైపోతారు. ఆధ్యాత్మిక రంగంలో ప్రాలుమాలిక మరింత అనర్థానికి దారితీస్తుంది.

సోమరితనం అజ్ఞాన లక్షణమే. అది మానవ కర్తవ్యాన్ని విస్తరింపజేసి, అతనికే కాక, దేశానికి, మానవ సంఘానికి కూడా అపారమైన అనర్థం తెచ్చిపెడుతుంది. సోమరితనం విపరీతంగా విజృంభించి ఉన్నందువల్లనే మన దేశాభివృద్ధి కడు అధోగతిలో ఉంది. దుష్ట స్వభావం కలవాడు పైకి ఎంత మంచిగా నటించినా, అతని అంతఃకరణ అంతరంగము విషమయమే. అట్టివాడు చెప్పేదొకటి, చేసేదొకటి. కాని అలాటివాడు సైతము భగవన్నామ సంకీర్తన చేస్తూ భగవత్పాదపద్మాలపై నిలుప నేర్చుకొన్నట్లయితే తప్పక అతడు పుణ్యవర్తనుడుగా మారిపోతాడు. మట్టి ఆవరణలో కప్పబడి ఉన్న కీటకం చుట్టూ ఝుంకార రూపమైన ప్రణవనాదం చేస్తూ తిరుగుతుంది భ్రమరం. లోనఉన్న కీటకం భయభ్రాంతమై యితర చింతన లేక, ఆ ప్రణవనాదాన్నే తాను కూడా ధ్వనించటం ప్రారంభిస్తుంది. దీని పర్యవసానంగా తుట్టతుదకు ఆ కీటకం తన పూర్వపు వికృతరూపాన్ని వదలి, చక్కని సీతాకోక చిలుకగా మారిపోతుంది. దీనినే భ్రమర కీటక న్యాయం అంటారు.

ఒక సంపన్నుడు నన్నొక పర్యాయం తన కారులో మద్రాసు తీసుకెడుతున్నాడు. అక్కడ హైకోర్టులో ఆయన సినిమా దావా నడుస్తున్నది. నన్ను తనతో తీసుకు వెడితే ఆ దావాలో తనకు గెలుపు నిశ్చయమని ఆయనకు నమ్మకం. అది ఆయన స్వార్థం కాగా నాకు కూడా మరొక విధమైన స్వార్థం ఉంది, అతని హృదయ క్షేత్రంలో ఆధ్యాత్మిక బీజాలు నాటాలన్నదే. దారిలో ఆయన నన్ను అడిగాడు 'కేసు గెలుస్తానా?' అని. "ఆందోళన చెందకు. అనుకూలంగానే ఉంటుంది' అన్నాను. 'నాకు ఆందోళన లేదు బాబూ! మీ దయ నాకు ఉన్నప్పుడు ఆందోళన చెందవలసిన పనేముంది?' అన్నాడు. అది నాలుక నుండి దొర్లిన ప్రేమకాని, హృదయంలో పొదిగి ఉన్న ప్రేమ కాదు. అతని 'విశ్వాసము, ప్రేమ హృదయంలో పాదుకున్నవే అయితే కేసు విషయమై అతని సందేహం ఎందుకు కలుగుతుంది?' నేను అప్పుడు అన్నాను, 'మీ మనసు యీ కారు కంటె ఎక్కువ వేగంగా పరుగెడుతోంది చూశారా? అప్పుడే అది మద్రాసు హైకోర్టులో ఉంది. అలా కాకుండా మీ మనసు భగవంతుని గురించే చింతిస్తూ ఉంటే, యిట్టి ఆందోళన మీకు లేకుండా ఉండటమేకాక, మీకు అనుకూలమైన తీర్పు యిచ్చేటట్లు ఆయన జడ్జి ఆలోచనలను ప్రభావితం చేయడా?' అని. అలాగే జరిగింది. ఆయన కేసు గెలిచాడు.

ఇక్కడ ముఖ్యంగా గమనించవలసినదేమంటే జీవితంలో నీకు సమస్యలెదురైనా, నీ మనసును ఆందోళన చెందనీయకు. ఆలా అందోళన పడటం వలన ఆ సమస్యలు పరిష్కారం కావు. ఆ సమయంలో దాన్ని భగవంతుని యందు లగ్నం చెయ్యి. ఇక ఏ ఆందోళనలు నీకు ఉండవు. ఆ సమస్యల బాధ్యత భగవంతుడే వహిస్తాడు.

(తరువాయి భాగం కోసం 33వ పేజీలో చూడండి)

# బాలకృష్ణుని లీలలు

– రమణ ప్రసాద్

గోపాల్‌రాయి దధి మాంగత్ అరు రోటీ ।
మాఖన్ సహిత్ దేహి మెరీ మయ్యా, సుపక్ సుకోమల్ రోటీ ॥
కత హెూ ఆరి కరత మేరే మొహన్, తుమ్ ఆంగన్ మే లోటీ? ।
జో చాహెూ సో లేహు తురతహీ, ఛోడో యహ మతి ఖోటీ ॥
కరి మనుహారి కలేఊ దీన్హో, ముఖ్ చుపరాయో అరూ చోటీ ।
సూరదాస్ కో  ఠాకుర్ ఠాడో, హాథ్ లకుటియా ఛోటీ ॥

గోపాలరాయుడు వెన్న పెట్టమని గోల చేస్తున్నాడు. ఒక ప్రక్క చేతులు చాచి అడుగుతాడు. యశోద ఇటు తిరిగే సరికి పెరుగు కుండలో చేతులు పెడతాడు. అమ్మతో " అమ్మా! నాకు వెన్న పెట్టు. వెన్న రాచిన సుకోమలమైన మెత్తటి రొట్టె పెట్టు" అంటాడు.



యశోద " మోహనా! నువ్వు బయట గంతులు వేస్తావేమిటి? ఈ చెడ్డ అలవాటు మానుకో. ఇలా రా. నీకు ఏది కావాలో అది త్వరగా తీసికొ." అని తల్లి వానిని దగ్గరకు తీసికొని అతడికి  వెన్న రొట్టె ఇచ్చి ముఖానికి తలకి నూనె రాచింది.

సూరదాసు ఈ దృశ్యాన్ని తిలకిస్తూ మురిసిపోతూ అంటున్నాడు ' నా స్వామి ఒక చేతితో రొట్టె, ఇంకొక చేతితో చిన్న కర్ర పట్టుకొని అందాలు చిందిస్తున్నాడు" అని.

*

# కృష్ణా మా ఇంటికి రావో...

## 1. శ్రీకృష్ణుని బాల్య క్రీడలు

కృష్ణా మా ఇంటికి రావో
గజ్జెలందియలు ఘల్ ఘల్‌మని మ్రోయంగ
బొజ్జలో ఈరేడుభువనాలు కదలంగ ॥
ఉట్లమీదను వెన్న పెరుగును త్రాగెదవా
కాళీయమర్దనా కౌస్తుభ మణిహారా ॥

కాలక్రమంలో బల రామ కృష్ణులు ఇంట్లో ఇటూ అటూ తిరగటం, గోపాలబాలురతో ఆడుకోవటం మొదలు పెట్టారు. వారి ఆట పాటలు చూసి నందాదులే కాక గోకులం అంతా మురిసి పోతోంది. వారి శిశు క్రీడలు ఆబాల గోపాలాన్ని అలరిస్తున్నాయి. వారిని చూడకుండా అక్కడివారు ఒక్క క్షణం కూడా ఉండలేక పోయేవారు.




వారి ఆటలు ఈ విధంగా ఉండేవి :

“నేను గోవల్లభుడిని. మీరు గోవుల”ని అంటూ గోపబాలురతో కృష్ణుడు ఆడేవాడు; ఇంకా “నేను రాజును. మీరు భటులు రండి!రండి! అనేవాడు; “నేను దొంగని. మీరు ఇంటివారు” అని వారిని నిద్ర పొమ్మని వారి సొమ్ములు తీసుకుని దాక్కొనేవాడు. ఇలా ఆటలాడుతూ,ఉయ్యాలలూగుతూ, దాగుడుమూతలు ఆడుతూఉండేవాడు కృష్ణయ్య.

వయస్సుతో పాటు బాలకృష్ణుని చిలిపిచేష్టలు, అల్లర్లు పెరిగాయి. ఆ అల్లర్లు మితి మీరాయి. గోపకాంతలు యశోద ఇంటికి వెళ్ళి ఈ విధంగా ఫిర్యాదు చేయసాగారు:

క॥ బాలురకు బాలు లేవని
బాలింతలు మొరలు వెట్టఁ బక బక నగి యీ
బాలుండాలము సేయుచు
నాలకుఁ గ్రేపులకు విడిచెనంభోజాక్షా!

“ ఓ యశోదా! విను. మా ఇళ్ళలో ఒకవైపు చంటిపిల్లలకు పాలులేవని అల్లాలాడుతుంటే నీ కుమారుడు పక పక నవ్వుతూ ఆ ఆవులకు దూడలను విడిచి వెళ్లాడు.” అని ఒకామె ఫిర్యాదు చేసింది.

మరొక గోపిక:

కll పడతీ! నీ బిడ్డడు మా
కడవలలో నున్న మంచి కాఁగిన పాలా
పడుచులకుఁబోసి చిక్కిన
కడవలఁ బోనడిచె నాజ్ఞ కలదో లేదో?

“నందరాణీ! చూడమ్మా! నీ బిడ్డడు కడవలనుంచి బాగా కాగిన పాలను తన మిత్రులకు పోశాడు. అంతే కాదు. కడవలను విరగొట్టి మరీ వెళ్ళాడు. ఇలా చేయమని నువ్వు ఆదేశించావో ఏమో!”

ఇంకొకామె,

మ.కోll పుట్టిపుట్టఁడు నేఁడు దొంగిలబోయి మాయలు సొచ్చి తా
నుట్టి యందక ఱోలుఁ బీఁటలు నొక్క ప్రోవిడి యెక్కి చే
వెట్టఁజాలక కుండ క్రిందొక పెద్దతూఁటొనరించి మీ
పట్టి మీఁగడ పాలు చేరలఁ బట్టి త్రావెఁ దలోదరీ!

“ ఓ యశోదమ్మా! నీ బిడ్డ సామాన్యుడు కాడు. మా ఇంట్లో పాలు దొంగిలించటానికి వచ్చి, ఉట్టి అందకపోతే రోలు, పీటలు దొంతర పెట్టి ఎక్కి చూశాడు. ఉట్టి అందలేదు. అప్పుడు కుండ క్రింద ఒక కన్నం పెట్టి ఆ కన్నం నుండి కారిన మీగడ పాలను దోసిళ్ళతో త్రాగాడు”అన్నదొక గొల్లభామ.

ఇంకొక గోపెమ్మ,“ అమ్మా!,“ అమ్మా! నీ కొడుకు ఒక ఇంటికి వెళ్ళి ఏ సంకోచం లేక మీగడ పెరుగు త్రాగి ఒకింత ఆ ఇంటి కోడలి మూతికిపూసి పారిపోయాడు. అప్పుడు ఏం జరిగిందంటే కోడలే దొంగతనంగా వెన్న తిన్నదని ఆమె అత్తగారు ఆమెను కొట్టింది.” అని చెప్పింది.

అక్కడికి వచ్చిన భామలందరూ-

కll ఓ యమ్మ! నీ కుమారుఁడు
మా యిండ్లను బాలు పెరుగు మననీఁడమ్మా!
పోయెద మెక్కడికైనను
మా యన్నలసురభులాన మంజులవాణీ!

“ ఓ యశోదమ్మ తల్లీ! ఇంక లాభం లేదు. మీ కుమారుడు మమ్మల్ని బ్రతుకనీయడు. మా ఇళ్ళలో పాలు పెరుగులు మాకు దక్కనీయడు. మా మగవారిమీద, గోవులమీద ఒట్టు! మేము ఇంకెక్కడికైనా పోతాము.” అన్న గోపెమ్మలతో యశోద-

తేll అన్యమెరుఁగడు తనయంతనాడుచుండు
మంచివాఁడితఁడెగ్గులు మానరమ్మ!

రామలార! త్రిలోకాభిరామలార!

తల్లులార! గుణవతీమ తల్లులార!

" ఇదేం చోద్యమమ్మా!నా కుమారుడు ఎప్పుడూ నా ఒడిలోనే ఉన్నాడు. ఎక్కడికీ వెళ్ళలేదు. తానొక్కడే ఆడుకుంటాడు. ఇటువంటి మంచివాడిమీద నిందలు మోపటం ఏమీ న్యాయం కాదు. ఓ తల్లులారా! మాతృమూర్తులారా!" అంది.

బాలకృష్ణుని వినోదములను (అల్లరులను) వివరించిన గోపికలను చూసి విస్మితురాలైంది యశోద. ఇంతలో మరికొందరు గోపికలు తమకు చిక్కిన దొంగ కృష్ణుని తలకొకరు బంధించి ఆమె వద్దకు తెచ్చారు. ఇక్కడ చూస్తే చిన్ని కృష్ణుడు యశోద ఒడిలో పడుకుని నిద్రపోతున్నాడు. తీరా చూస్తే తాము తెచ్చిన కృష్ణులు మాయమైనారు. వారు ఆశ్చర్యంతో తలమునకలై ఈ విధంగా అభియోగం తెచ్చినందుకు సిగ్గుపడి వెను దిరిగి పోయారు.



కృష్ణుని ఇంట్లో వెన్న మీగడలకు కొదువలేదు. మరి కృష్ణుడు నవనీతాన్ని యితరుల ఇళ్ళలో ఎందుకు దొంగిలించాడు? అంటే దీనికి ఒక కారణం చెపుతారు. నందగోకులంలోనివారు పాలు, పెరుగు, వెన్నలను మధురానగరంలో అమ్మి ఆ వచ్చిన ధనంతో తమ జీవనం కొనసాగిస్తారు. వెన్న మీగడలు వారి పిల్లలకు అందకుండా పైన ఉట్టిమీద పెడతారు. అందుచేత వారికి వెన్న మీగడలు తినే అవకాశం లభించదు. మరి కృష్ణుడు అంతటా సమానత్వాన్నే కాంక్షిస్తాడుకదా! అందుకే యితరుల యిళ్ళలోకి జొరబడి వారి ఇళ్ళలో లభించిన వెన్న మీగడలను తోటి గొల్లబాలురందరికీ పెట్టి తృప్తి పరుస్తాడు. ఒక ప్రక్క తానుతింటూ, గొల్లబాలురకు పెడుతూ, ప్రక్కనే ఉన్న కోతులకు కూడా నవనీతాన్ని అందిస్తాడు.

ఈ విధంగా తన చేష్టలను గూర్చి ఇరుగు పొరుగు వారు తన తల్లికి చెప్పటం, తన తల్లి తన మంచితనాన్ని ఉగ్గడించటం, కృష్ణయ్య గ్రహిస్తూనే ఉన్నాడు. దొంగ నిదురపోతూ తనలో తాను ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ గోపికలు వెళ్ళేవరకూ నిదుర నటిస్తూనే ఉన్నాడు.

# సర్వజ్ఞుడు శ్రీబాబు

– జగం

ఎంతటివారైనా ఒకొక్కసారి వారికి తెలియకుండానే అబద్ధాలు చెబుతారు. అది అబద్ధం అని కూడా వారికి అనిపించదు. తెలిసి చేసినా తెలియక చేసినా తప్పు తప్పే. అందుకే 'మిత త్రయం, మిత్ర త్రయం' అన్నారు సద్గురుదేవులు శ్రీబాబు. 'మిత ఆహారం, మిత భాషణం, మిత నిద్ర.' తెలియని విషయాల గురించి అసలు నోరు విప్పరాదు. మౌనాన్ని భూషణంగా ధరించాలి.

ఒకొక్కసారి మనం ప్రొద్దుట ఏమి తిన్నామో సాయంత్రానికి గుర్తు ఉండదు. మరచిపోతాం. అటువంటిది మనకు కనిపించకుండా ఎక్కడో ఉన్నవారికి మనం ఏమి చేస్తున్నామో, ఏమి తిన్నామో ఎలా తెలుస్తుంది? అదే సర్వజ్ఞత! ఈ విషయాన్ని తెలిపే సద్గురు లీల ఒకటి సుమారుగా 1975లో జరిగింది.

శ్రీబాబు చిరకాల భక్తులు కొండ సీతారామరాజుగారు తమ కుటుంబంతో సహా అప్పట్లో నంబూరు గ్రామంలో ఉండేవారు. వారి భార్య శ్రీమతి చారుమతిదేవి, కొడుకులు రాఘవరాజు, ఉమామహేశ్వరరాజు (చిన్న).

బాబూజీకి నమస్కారం చేసుకుందామని చిన్న ఒకరోజు ఆశ్రమానికి వెళ్ళాడు. ఆ సమయంలో శ్రీబాబు వశిష్ఠాశ్రమంలో ఒక భక్తునితో మాట్లాడుతున్నారు. చేతులు కట్టుకుని చిన్న దూరంగా నిలబడ్డాడు. 'ఒరేయ్ గాడిదా, ఇటు రారా!' అని పిలిచారు బాబు. తనను కాదేమో అనుకుని చిన్న ప్రక్కన, వెనుక చూశాడు. ఎవరూ లేరు. 'నన్నా బాబూ!' అని అడిగాడు. 'నిన్నేరా' అన్నారు శ్రీబాబు. వెళ్ళి బాబుకు పాదనమస్కారం చేసుకుని, చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

బాబు 'ఏరా, అన్నం తిన్నావా?' అని అడిగారు. 'తిన్నాను బాబు' అన్నాడు చిన్న. 'ఏం కూర వేసుకుని తిన్నావురా?' అన్నారు. 'మాంసం కూర బాబు' అన్నాడు చిన్న. 'ఏం మాంసం రా?' తిరిగి ప్రశ్నించారు. చిన్న బుర్ర గోక్కుంటూ 'మేక మాంసం బాబు' అన్నాడు. 'ఛీ! వెధవా. గాడిద మాంసం తిని, మేకమాంసం అంటావా?' అన్నారు బాబు. 'లేదు బాబూ, మేకమాంసమే. అమ్మే వండింది కూడ' అన్నాడు చిన్న ధీమాగా.'ఛీ! మళ్ళీ అదే మాట, గాడిద, పో!' అని శ్రీబాబు గద్దించారు. నమస్కారం చేసుకుని చిన్న యింటికి వెళ్ళాడు. మనసులో ఉక్రోషం తన్నుకొస్తోంది.

బాబుతో ఉన్న భక్తుడు 'అదేంటి బాబూ, ఆ అబ్బాయి మేక మాంసం తిన్నాను అంటాడు. మీరేమో గాడిద మాంసం అంటారు. తిన్నది ఏమిటో వాడికి తెలియదా? పైగా వాళ్ళ అమ్మే వండారని అంటున్నాడు కదా. అయినా గాడిద మాంసం తిన్నాడని మీరు ఎలా అంటున్నారు? మీరు చూశారా?' అని అడిగాడు అమాయకంగా.

“వండిన వాళ్ళ అమ్మకే తెలియదు అది ఏం మాంసమో, ఇక వీడికేమి తెలుస్తుంది?” అన్నారు శ్రీబాబు. ‘అదేమిటి బాబూ? తెలియకుండా ఎలా వండుతారు?’ అన్నాడు. “అది అంతే. మా అమ్మ మాటకు తిరుగు ఉండదు.” అన్నారు బాబు. ‘ఏమిటో మీ మాటలు అన్నీ అర్థం అయినట్లే ఉంటాయి. కాని ఒక్కటీ అర్థం కాదు. అంతా విచిత్రం’ అన్నాడు ఆ భక్తుడు. “విచిత్రం నాది కాదు. మా అమ్మది. అమ్మ కాళీమాతకు అప్పుడప్పుడు పిల్లలతో ఆడుకోవటం అంటే చాలా సరదా. అందుకే నా చేత యిలాంటి తమాషాలు చేయిస్తుంటుంది. ఆ తమాషాలు చూసి ఆనందిస్తుంటుంది. అంతేకాని, నాకేమీ తెలియదు” అన్నారు శ్రీబాబు.

యింటికి వెళ్ళిన చిన్న ‘అమ్మా! నువ్వు పొద్దున వండినది మేక మాంసమే కదా’ అని అడిగాడు. ‘అవును’ అన్నారు చారుమతి దేవి. ‘మరి బాబు నేను గాడిద మాంసం తిన్నానని చెప్పి, గాడిద అని తిట్టారే నన్ను’ అన్నాడు చిన్న.

‘బాబు అలా అన్నారంటే అందులో ఏదో విశేషం తప్పకుండా ఉంటుంది. ఆ మాంసం మంగమ్మ ఆంటీ యిచ్చారు. కనుక్కుంటానులే. బాబు ఏదో అన్నారని నువ్వు మాత్రం బాధపడకు’ అన్నారు చారుమతి. ఇంతలో యింటి యజమాని భార్య మంగమ్మ వచ్చారు. ‘రండి వదినగారూ! మీ గురించే అనుకుంటున్నాము. పొద్దున మీరు యిచ్చినది మేక మాంసమే కదూ. చాలా బాగుంది’ అన్నారు చారుమతి.

‘అది మేకమాంసం కాదు వదినగారూ. గాడిద మాంసం. ఆ విషయం ముందే చెబితే మీరు తినరేమో అని మేకమాంసం అని చెప్పాను’ అన్నారు ఆవిడ.

వెంటనే చారుమతి ‘చిన్నా! అదీ సంగతి. తెలిసిందా? వదినగారూ! మీరు మేక మాంసం అని చెప్పి యిచ్చారు, నేను వండాను. వీడు ఏమీ తెలియకపోయినా మేక మాంసం అనుకుని తిన్నాడు. కాని వీడు యిందాక ఆశ్రమానికి వెళ్ళినప్పుడు, బాబు వీడితో ‘గాడిద మాంసం తిన్నావు’ అన్నారట.’

‘అదేమిటి? వండిన మీకు తెలియదు, తిన్న వీడికీ తెలియదు. మరి ఆయనకి ఎలా తెలిసింది?’ అని ఆశ్చర్యంగా అడిగిందావిడ.

‘అమ్మా! ఆంటీగారు ఇవ్వటం, నువ్వు వండటం, నేను తినడం బాబు చూడలేదు కదా! మరి బాబుకి ఎలా తెలిసింది?’ అన్నాడు చిన్న.

‘అదేరా ఆయన సర్వజ్ఞత. ఎవరెవరు, ఎక్కడెక్కడ, ఏమి చేస్తున్నారో ఆయనకి అన్నీ తెలుస్తాయి. బాబూ! నీకు వేయి నమస్కారాలు’ అని చేతులు జోడించారు చారుమతి. ‘మీ గురువుగారు చాలా మహాత్ముడిలా ఉన్నారే!’ అన్నారు మంగమ్మ.

‘మహాత్ముడిలా ఉండటం కాదు, వదినగారూ! ఆయన నిజంగా మహాత్ముడు! సర్వజ్ఞుడు1’ అన్నారు చారుమతిదేవి.

*

# సమర్థ సద్గురు సభ్యత్వాన్ని పెంచండి

భక్త మహాశయులారా!

మిమ్మల్ని ఎంతో అలరిస్తున్న "సమర్థ సద్గురు" తెలుగు మాసపత్రిక, "SAMARDHA SADGURU" ఇంగ్లీషు త్రైమాసిక పత్రికల సభ్యత్వాన్ని పెంచేందుకు మాకు సహకరించండి. రెండు విధాలుగా మీరు సభ్యత్వాన్ని పెంచవచ్చు:

1) గిఫ్ట్ స్కీమ్ – వివాహాది శుభకార్యాలలో, జన్మదిన సందర్భాలలో, తదితర సందర్భాలలో మీ కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ఈ పత్రికను బహుమతిగా ఇవ్వండి. ఒక సంవత్సరం పాటు తెలుగు మాస పత్రిక పంపుతాము. దీనికి మీరు కట్టవలసిన సొమ్ము 50 రూపాయిలు మాత్రమే.ఇదే విధంగా 50 రూపాయిలు కడితే ఇంగ్లీషు "SAMARDHA SADGURU" త్రైమాసిక పత్రిక 3 సంవత్సరముల పాటు పంపబడుతుంది. ముఖ్యంగా తెలుగు రాని ఆస్తిక మహాశయులకు ఇంగ్లీషు పత్రిక గిఫ్ట్‌గా పంపవచ్చును.

2) తెలుగు మాసపత్రికలను ఒక సంవత్సరం పాటు , ఇంగ్లీషు త్రైమాసిక పత్రికలను మూడు సంవత్సరమాలపాటు మీ జిల్లాలోని లైబ్రరీలకు, భక్త సంఘాలకు, తదితర సంస్థలకు పంపటానికి తగిన సొమ్ము కడితే, ఈ పత్రికలు ఎంతో మంది ఆస్తిక మహాశయులు చదవటానికి ఉపయోగపడుతుంది. దీనికి పైన సూచించిన ప్రకారం మీరు డబ్బు కట్టి స్పాన్సర్ (Sponsor)చేయవచ్చును. ఈ విధంగా మాసపత్రికల సభ్యత్వం పెంచేందుకు దాతలను ముందుకు రమ్మని ఆహ్వానిస్తున్నాము.

(ఏకాగ్రదృష్టి 26వ పేజీ తరువాయి భాగం)

గురుదేవుడు యిచ్చిన లక్ష్యార్థమునందు మనసును లగ్నమొనర్చి, నీ చేతనైనంత తీవ్రగతిలో దాన్ని నడిపించు. అప్పుడది తపస్సుగా మారి నీకు విశేష సిద్ధిని ప్రసాదిస్తుంది. అట్లా చేసేవాడు దేశభక్తుడైతే, అతడు కర్మయోగిగా మారి దేశసేవ చేస్తాడు. గాంధీ చేసింది అదే.

అతడు రమణమహర్షివంటి జ్ఞానియైతే లక్షలాది ప్రజల హృదయాలలోని అజ్ఞానాంధాకరమును పటాపంచలు చేసి, జ్ఞానజ్యోతిని వెలిగిస్తాడు. అతడు భగవద్భక్తుడైతే లక్షలాది ప్రజల హృదయాలను భగవచ్చరణారవిందాలయందు మళ్ళించి, ఆయన్ను దర్శించుటకు, ఆయనతోడి సాయుజ్యమును పొందటానికి తోడ్పతాడు. భగవానుడు మీ మనస్సును తన శాశ్వత నిలయం గావించుకోగలిగినట్లు దానిని ఆయన యందు నిలుపుకోవాలనే మీరెల్లరకూ ఆ కరుణామయుడు కృపావిశేషం కలిగించుగాక! అని ఆశిస్తున్నాను.

*

## శ్రీసద్గురు పుణ్యారాధన రజతోత్సవ వేడుకలు
## అందరూ ఆహ్వానితులే!

శ్రీసర్వాధిష్ఠాన చైతన్య విశ్వమత ప్రవక్త సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి రజతోత్సవ పుణ్యారాధనములు కాళీవనాశ్రమ పీఠాధిపతి పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీప్రసాద మాతాజీ వారి ఆధ్వర్యంలో శ్రీకాళీవనాశ్రమం (శ్రీకాళీగార్డెన్స్), నంబూరులో  ది. 20-11-2013 బుధవారం నుండి ది. 1-12-2013 ఆదివారం వరకు పంచయజ్ఞ విధులతో జరుపబడును. నిత్యమూ శ్రీగురుగీతా ప్రచనము, శ్రీసద్గురు శతసహస్ర నామార్చనలు, మహామంగళ హారతులు ఉంటాయి.

విశేష కార్యక్రమాలు -

నవంబర్ 20 నుండి బ్రహ్మశ్రీ కొండూరి రామబ్రహ్మంగారి ఆధ్వర్యంలో హెూమము జరుగును.

నవంబర్ 24, 25, 26 తేదీలలో సాధుధర్మ సమ్మేళనము.

నవంబర్ 27న యతీశ్వర పూజలు.

ఈ ఉత్సవాలలో అఖండ హరినామ సంకీర్తన, సామూహిక సద్గురుపాద పూజలు, నౌకావిహారము, ఊంజల సేవ, నగరోత్సవములు ఉంటాయి.

ఈ కార్య క్రమాలలో ప్రతి భక్త హృదయము పాల్గొనాలని మా ఆకాంక్ష. ఈ కార్యక్రమాలలో పాల్గొనుటకు వీలుగా శలవు పెట్టుకునేందుకు ముందుగా తెలియచేయుచున్నాము.

వివరములకు -

ట్రస్ట్ కార్యాలయము - 0863 2293564

కుమారస్వామి రాజా - 93465 35357

మురళీమోహనవర్మ - 93983 34345

ఎ. కుమారస్వామి - 93945 35357

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

– విజయేశ్వరానంద ప్రసాద్

**శ్రీ శేషగిరిరావుగారితో శ్రీబాబు**

ఆ క్షణం నుండి శేషగిరిరావుగారు శ్రీ బాబునే జగన్మాతగాను, గురువుగాను మనసా స్వీకరించి, తను మనో ధనములతో శ్రీ బాబు శ్రీ చరణాలను ఆశ్రయించారు. శ్రీ బాబు వారికి యిటు సాధనలోనూ అటు వైద్య వృత్తిలోనూ కూడ నూతనోత్సాహాన్నీ శక్తినీ ప్రసాదించారు. క్రొత్త ఓషధులను, వాటితో మేలు రకం ఔషధాల తయారీ పద్ధతులను సూచించారు. ఇంకా మైనారిటీ అయినా తీరనట్లు కనిపించే యీ బాల భగవానునిలోని దివ్యత్వమునూ, అపూర్వ అద్భుత శక్తులనూ, అంతకు మించిన వినమ్రతనూ, అవ్యాజ అపార ప్రేమనూ చవి చూస్తున్న కొలది, శేషగిరిరావు గారిలో ఆశ్చర్యమూ ఆనందమూ ఆరాధనా భావమూ ముప్పిరిగొన్నాయి.



శేషగిరిరావుగారు తాంత్రిక సాధనలలో బాగా ఆరితేరిన వారు. కాని శ్రీబాబు వారితోతాంత్రిక విద్యలు క్షుద్రములని, అవి మానవులను ఎన్నటికీ తరింపచేయలేవని, తరింపచేసేది ఆత్మ జ్ఞాన మొక్క టే అని ప్రబోధించి, ఆసాధనలను పూర్తిగా మాన్పించారు.

అప్పటి నుండి శేషగిరిరావుగారు తమ దేవతార్చన పీఠంలో శ్రీకాళీమాత శ్రీ వీరహనుమానుల మూర్తులతో పాటు శ్రీబాబు మూర్తిని కూడ పెట్టుకొని నిరంతరము పూజించుకొన్నారు. శ్రీబాబును పుంభావ కాళి మూర్తిగా గుర్తెరిగి, జగన్మాతను జ్ఞానపరంగా ఆరాధించటం నేర్చుకొన్నారు. చతుర్విధ శుశ్రూషలతోనూ వారు శ్రీబాబును సేవించుకున్నారు. తామే స్వామికి స్నానం చేయించే వారు. భోజన సమయంలో ప్రక్కన ఉండి, శ్రీబాబుకు తామే స్వయంగా వడ్డించే వారు. ఏయే పదార్థాలు స్వామి తీసుకోవాలో, యేవి వారి ఆరో గ్యానికి అనుకూలంగా ఉంటాయో సలహా చెబుతూ, తల్లి బిడ్డను అన్నం తినిపించినట్లు తినిపించే వారు. శ్రీ దేవీ శరన్నవరాత్రి పూజలు సమీపిస్తున్నాయనగానే ప్రతి విషయమూ శేషగిరిరావుగారే స్వయంగా పర్యవేక్షించి, పూజ గదిలోని ఏర్పాట్లతో సహా అన్నీ చూసుకొనే వారు. ప్రతిపనిలోనూ పరిశుభ్రత, శ్రద్ధా భక్తులు ఎంత అవసరమో,ఎలా చేయాలని శ్రీబాబు అభిలషిస్తారో, అలా జరిగేటట్లు చూసుకొనే వారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి గణపతి పూజ మొదలు, ద్వాదశినాడు దీక్షా విరమణ, శ్రీ సద్గురు పాదపూజ పూర్తి అయ్యేవరకు అన్ని కార్యక్రమాలనూ శేషగిరిరావుగారు శ్రద్ధగా జరిపించి, శ్రీబాబుకు ఎనలేని ఆనందం కలిగించే వారు. శ్రీ బాబు జగన్మాత

పూజచేసుకొనే సమయంలో శేషగిరిరావుగారు ప్రక్కన ఉండి అన్నీ అందిస్తూ సహాయపడేవారు. భక్తి పాశాలకు మాత్రమే కట్టుబడే శ్రీ బాబు, పసిపిల్లవాని వలె శేషగిరిరావుగారి సూచనలను అనుసరించినట్లు బాహ్య దృష్టికి కనిపించేది. కాని అంతర్యంలో, అరవై సంవత్సరాల శేషగిరిరావుగారు శ్రీ బాబును తమ గురుదేవులుగా భావించుకొని, తాము శిష్యులై వారిని అనుసరించి ఉండేవారు. శ్రీ బాబు మనస్సులోని ఆలోచనలను వారి కనుసన్నలలోనే గ్రహించి ఆచరించి గురుదేవులకు ఆనందం కలిగించేవారు. నిజానికి గురు శిష్యులకు రూప భేదమేగాని ఉన్నది ఒక్కటే.

శ్రీ పరశురామయ్యగారు బాహ్య దృష్టిలో శ్రీ బాబుకు పితృతుల్యులు. వారు శ్రీ బాబును" నా జ్ఞానపుత్రుడు" అనేవారు. కాని, ఆంతర్యంలో తనయుడు తండ్రిని సేవించుకున్నట్లు శ్రీ బాబును సేవించుకున్నారు. తత్వతః తండ్రియే తనయుడు, తనయుడే తండ్రి . ఇద్దరు లేరు. ఉన్నది ఒక్కటే. లక్ష్మణుడు శ్రీరామునే సేవించుకున్నట్లు రాజుగారు శ్రీబాబును సేవించుకున్నారు . అన్నదమ్ములకు రూప భేదమే గాని, యిద్దరు లేరు. ఉన్నది ఒక్కటే. ఈ తండ్రీ బిడ్డల, గురు శిష్యుల, అన్న దమ్ముల అనుబంధాలు అలౌకికాలు. కేవల ఆత్మానుబంధములు. ఇన్నిటిలోనూ ప్రకాశించే ఏకైక తత్వమే ఆత్మతత్వము.అదేగురు తత్వము. అదే శ్రీ బాబు తత్వము.

శ్రీ బాబు వద్దకు వచ్చేవారిలో అన్ని రకాల వాళ్ళూ ఉండేవారు. కోరికలతో వచ్చేవారు, సమస్యలతో వచ్చేవారు, విమర్శకోసం వచ్చేవారు, కాలక్షేపం కోసం వచ్చేవారు, కపట వర్తనులు, యిలా ఎందరో! కాని ఎవరు శ్రీ బాబు దర్శనం కోరి వచ్చినా, ముందుగా వారు శేషగిరిరావుగారిని చూడవలసినదే.శేషగిరిరావుగారు వాళ్ళ ఆంతర్యం తెలుసుకోటానికి వాళ్ళతో విచిత్రంగా ప్రసంగించే వారు. "బాబును చూడటానికి వచ్చారా? ఏం చూస్తారు? గ్లాస్కోపంచె,సిల్కు లాల్చీ,వంకె వంకెల క్రాపు, నున్నగా గీసిన గడ్డం, మెడలోనూ,చేతులకూ బంగారు ఆభరణాలు -ఇవేగా? మీసాలు గడ్డాలు పెంచిన యోగీ కాదు. శిరో ముండనము చేయించుకున్న సన్యాసీ కాదు. ఆయన దగ్గర ఏమున్నదని వచ్చారు? గాలిలో చేతులు తిప్పి బంగారం సృష్టిస్తారనా? లేక ' క్షూ మహంకాళీ' అని మీ సమస్యలను యిట్టే మాయం చేస్తారనా?ఏదో 'కాళీ దయ' అంటారు. తీర్థమూ, ప్రసాదమూ యిస్తారు. 'అంతా జగన్మాత దయ' అంటారు. అంతే గదా? ఇక్కడ మీ బేరమేమీ గిట్టేది కాదు "అని పుల్ల విరుపుగా మాట్లాడేవారు. వాళ్ళు నిజంగా ఆర్తులో, జిజ్ఞాసువులో అయితే,ఆ పరీక్షకు తట్టుకుని నిలబడేవారు. వారికి శ్రీ బాబు దర్శనం లభించేది. లేకపోతే ఇంతే సంగతులు. శేషగిరిరావుగారు వాళ్ళను గురించి శ్రీ బాబుతో " ఒట్టి తాలు గింజలు లెండి బాబు !" అని పెదవి విరిచేవారు.

-సశేషం




-రమణ ప్రసాద్

# జనాబాయి

జనాబాయి వంట పూర్తి చేసింది. పాండురంగనితో నామదేవులవారి కుటుంబ సభ్యులందరూ భోజనానికి కూర్చున్నారు. జనాబాయి వడ్డన చేస్తోంది. పాండురంగడు కూడా భోజనం చెయ్యటం ప్రారంభించాడు. జనాబాయి వంట ఇంట్లోకి వెళ్ళి దుఃఖంతో "హే పాండురంగా! నేను చేసిన నేరం ఏమిటి? నీ సన్నిధానంలో భుజించే అపూర్వ అవకాశానికి నోచుకోని అభాగ్యురాలిని" అని విచారిస్తుంటే, భక్తజన హృదయాంతరంగుడైన భగవానుడు జనాబాయి హృదయం లోని కోర్కెను గుర్తించాడు. "నామదేవా! నాకు కొంత విశ్రాంతి కావాలి. తరువాత భోజనం చేస్తాను. నా ఆహారాన్ని భద్రపరచండి" అని చెప్పి వెళ్ళి పడుకున్నాడు. నామదేవులవారు స్వామికి పాదసేవ చేస్తుంటే, స్వామి నిద్రించినట్లు నటించారు. నామదేవులవారు వెళ్ళి పడుకున్నారు.



అందరూ నిద్రపోయాక పాండురంగడు లేచాడు. "జనా! నాకు ఆకలిగా ఉంది. భోజనం వడ్డించు" అన్నాడు. జనాబాయి భోజనం పెట్టింది. జనాబాయి ఎదురుగా కూర్చుని ఆ దివ్యమంగళ స్వరూపాన్ని చూస్తోంది. స్వామి కొద్దిగా రుచి చూశాడు. "జనా! భోజనం చాలా రుచికరంగా ఉంది. నువ్వుకూడా కాస్త తిను" అంటూ స్వామి తన స్వహస్తాలతో తినిపించాడు. ఆహా ఎవరికి కలుగుతుంది ఆభాగ్యం! బ్రహ్మాది దేవతలకు కూడా దొరకదు. స్వామి అందించిన పదార్థాన్ని భుజించగానే జనాబాయి అనూహ్యమైన అనుభవ శిఖరాలను అందుకుంది. ఈ అపూర్వ అవకాశం ఎవరికి లభిస్తుంది? బృందావనంలో గోపబాలురకు రాధకు లభించి ఉంటుందేమో. ఆ కోవకు చెందిన భక్తురాలు కనుకనే జనాబాయి ఆ అదృష్టానికి నోచుకొంది. జనాబాయితో ఆధ్యాత్మిక విషయాలను ముచ్చటించి బ్రహ్మముహూర్త కాలంలో అదృశ్యమై ఆలయంలో భక్తులకు దర్శనమివ్వటానికి బయలుదేరి వెళ్ళాడు.

ఒకసారి ఆషాఢ శుద్ధ ఏకాదశినాడు నామదేవులవారి గృహానికి జ్ఞానదేవులు, నివృత్తినాథుడు, సోపాన్, ముక్తాబాయిలు వచ్చారు. వారివెంట రామానంద స్వామి, కబీర్‌దాసులు కూడా వచ్చారు. ఆ సమయంలో నామదేవులు ఇంట్లో లేరు. జనాబాయి తాను ఆవు పేడతో చేసిన పిడకలు తీసుకొని వెళ్ళినదని ప్రక్కింటి ఆవిడతో జగడం

చేస్తూ ఉంటుంది. వాగ్వివాదాలు తారాస్థాయికి చేరటంతో అక్కడకు వెళ్ళిన భక్తులు ఆశ్చర్యపోయారు. కబీర్‌దాస్ ముందుకు వచ్చి "అమ్మా జనాబాయి! నీ పొరిగింటి ఇల్లాలు కూడా పిడకలు చేసింది. ఆవిడ తీసుకున్నవి నీవు తయారు చేసినవే అని ఎలా చెప్పగలవు" అని అడిగాడు. అందుకు జనాబాయి "మహాత్మా! వాస్తవాన్ని తెలుసుకోగల ఉత్తములు మీరు. న్యాయమెవరిదో మీరే తేల్చి చెప్పండి. నేను పిడకలు చేస్తున్నప్పుడు పాండురంగడి నామం చేస్తూ చేశాను. మీరు నేను తయారుచేసిన పిడకలను చెవి దగ్గర ఉంచుకోగానే అవి పాండురంగడి నామాన్ని వినిపిస్తాయి" అని చెప్పింది. కబీర్‌దాస్ పరీక్షచేసి చూస్తే జనాబాయి తయారు చేసిన పిడకలు శ్రావ్యంగా "పాండురంగా" "పాండురంగా" అని వినిపించింది. జనాబాయి భక్తి ప్రపత్తులకు కబీర్‌దాస్ మున్నగు భక్తులు భక్తిపారవశ్యంతో ఆనందాశ్రువులు కార్చారు.

జనాబాయి కీర్తిప్రతిష్ఠలు నలువైపులా వ్యాపించాయి. ఆమెను అందరూ మహా భక్తురాలు అని ప్రశంసించారు. ఆమె దర్శనం కోసం అనేక గ్రామాలనుండి వస్తున్నారు. ఆమె శాస్త్ర విషయాలను ఏకరవు పెట్టదు. ఆచరణమే ఆవిడ వేదాంతం. అహంకారం ఆమెలో అసలు లేదు. నమ్రతయే ఆమె జీవన విధానం. ప్రేమయే ఆమె జీవన తపస్సు. తాను పాండురంగని కృప పొందిన విధానాన్ని ఒక చక్కటి కీర్తన ద్వారా తెలియ చేసింది.

ధరిలా పంఢరీచె చోర గలా బంధోనియా దొర
హృదయ బందీ...కేలా అంత విఠల కోందిలా
శబ్దకేలీ జుడాబోడీ । విఠల పాయీఘూతల బేడీ
సోహం శబ్దాచా మారా కేరా । విఠల కాకులతీ ఆలా
జనీమ్హాణీ బా విఠలా । జీవేం స సోఢీ మితులా ॥

"భక్తి అనే గుడ్డను మెడలో వేసి పండరీనాథుని నిలబెట్టాను. నా హృదయాన్ని కారాగారంగా మార్చి అందులో విఠలుని బంధించాను. ప్రణవ నాదమనే గొలుసుతో పాండురంగని పాద పద్మాలను కట్టివేశాను. నిర్గుణ పరబ్రహ్మ స్థితిని పొందినా నాకు సగుణ రూపమే ఇష్టం. నా గోపాలుని అనంత ప్రేమలో కరిగి పోయాను" అని గానం చేసింది.

గుణాబాయి ఒకనాడు జానాబాయిని పిలిచి జొన్నల పిండిని విసరమని చెప్పింది. ఆ రాత్రి అందరు నిద్రపోయిన తరువాత పాండురంగని నామాన్ని ఆలాపిస్తూ జొన్నలు తిరుగలిలో పోస్తూ విసురుతుంటే, తిరుగలిలో జొన్నలు పిండిగా మారుతుంటే, భగవన్నామం అనే తిరుగలిలో సంచిత కర్మలనే జొన్నలను తిప్పితే నామరూపాత్మకమైన ప్రపంచం అదృశ్యమై దివ్యచైతన్యమే అనుభూతి అవుతుంది అనే భావనతో పాడుతూ జొన్నలు విసురుతూ ఉంటుంది.

జనాబాయి భావగర్భిత గానాన్ని విని పాండురంగడు ఆమెకు ప్రత్యక్షమయ్యాడు. ఆమెకు ఆధ్యాత్మిక విషయాలను తెలియజేశాడు. జనాబాయికి పిండి తయారుచేయటంలో ఆమెకు భగవానుడు సాయం చేశాడు.

బ్రహ్మముహూర్త సమయానికి పుండరీక వరదా! పాహిమాం! పాండురంగ విఠలా పాహిమాం! అని భక్తుల నినాదాలు చంద్రభాగా నదీతీరాన స్నానానంతరం చేస్తున్న నినాదాలు విన వస్తూంటే జనాబాయి "స్వామీ! భక్తులు మీ దర్శనార్థం ఆలయానికి వస్తున్నారు. తమరు వెళ్ళి భక్తులను కరుణించండి" అంటుంది. పిండి విసురుతున్నప్పుడు తిరగలి ప్రక్కనే ఉంచిన అభరణాలను మరచి జనాబాయి కప్పుకొనే బొంతను పైనవేసుకొని ఆలయంలో ప్రవేశించాడు పాండురంగడు.

ఆలయంలో అర్చకులు తలుపులు తెరవగానే స్వామి అభరణాలు, పీతాంబరము అదృశ్యమయి వాటి స్థానంలో చిరిగిన బొంత ఉంది. భక్తులలో ఒకరు ఆ బొంత జనాబాయిది అని గుర్తించాడు. పూజారులు కోపోద్రిక్తులయి, వారు న్యాయాధీశునికి ఫిర్యాదు చేశారు. అందరూ జనాబాయి ఇంటికి వెళ్ళి నిజమేమిటో చెప్పమంటారు. ఆమె నాకు ఏమీ తెలియదు అన్నది. ఇల్లు సోదా చేస్తే తిరుగలి సమీపంలో స్వామి అభరణాలు కనిపిస్తాయి. జనాబాయి వాటిని దొంగిలించినది అని ఆమెకు ఉరిశిక్ష విధించారు. నామదేవులవారు ఎంత వేడుకున్నా లాభం లేకపోయింది.

ఉరితీసే రోజు వచ్చింది. చంద్రభాగా నదీ తీరంలో సకల జనాలూ చూస్తుండగా ఉరితీయటానికి నిశ్చయించారు. ఆమెకు ఎఱ్ఱటి వస్త్రాలు ధరింపజేశారు. నడుముకు త్రాడు కట్టి లాక్కెళుతుంటే ఆమె పడిపోయింది. నిర్ధాక్షిణ్యంగా ఆమెను ఈడుస్తుంటే శరీరమంతా రక్తసిక్తమైంది. ఆమెను ఉరికంబం ఎక్కించారు. కులతత్వాలతో కరడు కట్టినవారు "ఈ అధమ కులస్తురాలు భక్తురాలు అనటమా? ఈమెకు తగిన శిక్ష ఇదే" అని సంతోషిస్తున్నారు.

జనాబాయి అంతిమ క్షణంలో చేతులు జోడించి "హే పాండురంగా! నిజానిజాలు నీకు తెలుసు. నేను చేయని దొంగతనానికి ఉరి శిక్ష పడుతోంది. తమ దర్శన భాగ్యమే మహాప్రసాదం అనుకున్నాను. నేను పనులు చేస్తూ ఉండటం చూసి నువ్వే నాకు సహాయం చేశావు కదా! మరి ఈ ఘోరాన్ని ఆపలేవా! మృత్యువు అంటే నాకు భయంలేదు. అది నన్ను శాశ్వతంగా నీ పాద సన్నిధికి చేర్చుతుంది" అని ప్రార్థించింది.

భక్తులను ఉద్దేశిస్తూ "పరమ పవిత్రులారా! మీకు శతకోటి ప్రణామాలు. పాండురంగడు ఆర్తజన రక్షకుడు. భగవన్నామమే మానవులు తరించటానికి సులభమైన మార్గము. భగవన్నామం సదా చేస్తూ ఉండండి. మీ మీ ఇళ్ళకు తరలిపోండి" అని ధ్యానమగ్నురాలైంది.

ఉరి తీయటానికి ఉపక్రమించారు. ఉరికంబం అదృశ్యమైంది. దాని స్థానంలో పుష్పపంక్తితో కూడిన లతలు వెలిశాయి. భక్తులంతా జయ జయ ధ్వానాలు చేశారు. అసూయాపరులంతా తలలు వంచుకున్నారు. పాండురంగని అపార ప్రేమాతిశయానికి పరవశించిన జనాబాయి కళ్ళవెంట ఆనంద భాష్పాలు వెల్లువగా ప్రవహించాయి.

జై జై పాండురంగ హరి! జై జై పాండురంగ హరి!

ఒకనాడు పాండురంగడు ఏదో వ్రాస్తూ ఉంటాడు. జ్ఞానదేవులవారు స్వామీ ఏమిటి వ్రాస్తున్నారు? అని అడిగారు. జనాబాయి గానం చేసిన కీర్తనలను వ్రాస్తున్నాను అని చెప్పాడు. జనాబాయి కీర్తనలు మీరు వ్రాయవలసిన అవసరం ఏమిటి? అని జ్ఞానదేవులు ప్రశ్నించారు.

"జ్ఞానదేవా! జనాబాయి కీర్తనలను గానంచేసి తదనుగుణంగా జీవించువారు తప్పక నా పాద సన్నిధికి చేరుతారు. ఇది నా శాసనము" అని చెప్పారు. భగవంతుని అనంత కృపకు పాత్రురాలై తాను తరించటమే కాక ఇతరులు తరించటానికి మార్గదర్శి అయిన ఆమె జీవిత చరిత్ర పరమ పావనము, మోక్షదాయకము.

*

1. చిత్తము ఆత్మలో నిలచినప్పుడెలా ఉంటుంది? మధ్యాహ్నం 12గంటల వేళలో ఎండలో పెట్టిన దీపంలా ఉంటుంది. ఉందా? ఉంది. లేదా? లేదు. వృత్తిహీనమై, ఆత్మ ప్రకాశంలో లీనమై ఉంటుంది.

2. పప్పుల పొడి తియ్యగా ఉందంటాము. అసలు అది చప్పటిది. తియ్యదనం దానిలో కలిసిన బెల్లానిది. తాను తియ్యగా ఉండి, పొడినీ తియ్యగా చేసింది. ఆత్మ స్వయంగా సుఖరూపము. తన ప్రతి బింబం ద్వారా విషయ వస్తువులను కూడ సుఖరూపంగా చేస్తుంది.

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL